ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
శనివారం 24 ఆగస్టు 2024



పరిశ్రమల భద్రతపై నేడు సమావేశం

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎసెన్షియా కర్మాగారంలో ఘోర ప్రమాదం జరిగి 17 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనతో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో పరిశ్రమల భద్రతపై శనివారం ఉదయం అనకాపల్లి కలెక్టరేట్‌లో, మధ్యాహ్నం మూడుగంటలకు విశాఖ కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించనున్నారు. పరిశ్రమల్లో పాటించాల్సిన భద్రతా చర్యలు, శిక్షణ, ఇతర అంశాలపై అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు చర్చించనున్నారు. ఈనేపథ్యంలో కఠినమైన నిర్ణయాలతో ప్రణాళిక రూపొందించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

కార్మికులతో చెలగాటం

అర్హత, అనుభవం లేకున్నా ఫార్మా కంపెనీల్లో విధులు

శిక్షణ విషయంలో యాజమాన్యాల నిర్లక్ష్యం



ప్రమాదం జరిగిన ఎసెన్షియా పరిశ్రమ (ఫైల్ ఫొటో)

- హైదరాబాద్‌తో పోల్చితే రీసెర్చి ల్యాబ్‌లు తక్కువే

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో భారీ ప్రమాదం నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో వందలాది కంపెనీల్లో ఉద్యోగులు/కార్మికుల అర్హత, అనుభవంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అర్హత లేకపోయినా తక్కువ వేతనాలకు దొరుకుతున్నారన్న దురాశతో ఉద్యోగులు, కార్మికుల జీవితాలతో కంపెనీలు చెలగాటమాడుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎసెన్షియా కంపెనీలో కూడా కొద్దిమంది మినహా మిగిలిన వారంతా అనుభవంలేని వారేనని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలే అంచనాకు వచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. మిగిలిన రంగాలకు భిన్నమైన పనివిధానం ఉండే కెమికల్/ ఫార్మా కంపెనీల్లో అందుకు తగిన అర్హతలున్నవారికి మాత్రమే తీసుకోవాల్సి ఉన్నా అనేక కంపెనీలు అవేవీ పట్టించుకోవడంలేదని, ప్రమాదం సంభవిస్తే రిస్క్ మేనేజ్‌మెంట్ చేసే అనుభవం ఉన్న వారు కూడా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

డిగ్రీ విద్యార్థులే అధికం..

ఫార్మా, కెమికల్ కంపెనీల్లో ఎక్కువగా బీఎస్సీలో కెమిస్ట్రీ చదివే విద్యార్థులను తీసుకుంటున్నారు. వీరికి తొలుత నెలకు రూ. 10వేల నుంచి రూ.15వేల వరకు జీతం ఇస్తారు. తరువాత క్రమేపీ పెంచుతారు. అదే ఎమ్మెస్సీ విద్యార్థులకు ప్రారంభ దశలోనే రూ. 25వేల వరకు ఇవ్వాలి. ఈ కంపెనీల్లో పనిచేయాలంటే రసాయన ప్రక్రియలు తెలిసి ఉండాలి. ప్రస్తుతం ఇంటర్ నుంచి డిగ్రీ వరకు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహణ ప్రహసనంగా మారింది. విద్యార్థులకు తెలియవు. పీజీకి వచ్చినా విశ్వవిద్యాలయాల్లో తప్ప ప్రైవేటు కళాశాలల్లో రసాయనాలతో లేబొరేటరీ తరగతులు నిర్వహణ తూతూమంత్రంగా ఉంటుందిలేదా అసలు ఉండదు.నాలుగైదు దశాబ్దాల క్రితం ఉన్నత పాఠశాలల్ల భౌతిక, రసాయన పరీక్షలు నిర్వహించేవారు. అందుకు అవసరమైన కెమికల్స్ ప్రభుత్వమే సరఫరాచేసేది. ఇప్పుడు పీజీలో తప్ప ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో కెమికల్స్ సరఫరా అనేది ఉండదు. ఈ నేపథ్యంలో డిగ్రీచదివిన విద్యార్థులు ఫార్మా కంపెనీలకు ఎంపికైనా రసాయనాలతో పనిచేసే అనుభవం ఉండదు.. ఎక్కువమందికి అసలు తెలియదని రిటైర్డు రసాయన శాస్త్ర అధ్యాపకుడు శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు.

చిన్న పరిశ్రమల్లో శిక్షణ నిల్

మల్టీనేషనల్ కంపెనీలు/ పేరున్న కంపెనీలు డిగ్రీ విద్యార్థులను నియమించుకున్న తరువాత కనీసం ... మిగతా 6వ పేజీలో

సినర్జిన్ ఫార్మాలో ప్రమాదం



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

రసాయనాలు ఎగసిపడి నలుగురికి గాయాలు

- విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు
- గురువారం అర్ధరాత్రి ఘటన

- వివరాలు మెయిన్ 11 లో

వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజనే కారణమా?

- ఎసెన్షియా కర్మాగారంలో సెన్సార్లు ఏమైనట్టు?
- పొగ, వాసన పసిగట్టే పర్యవేక్షణ లోపమా
- పీరియాడికల్ తనిఖీలు శూన్యం



ఎసెన్షియా పరిశ్రమలో పేలుడు ధాటికి కూలిన భవనం గోడ (ఫైల్)

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కర్మాగారంలో వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజన్‌పై ఇంజనీరింగ్ నిపుణులు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు. వాసన, పొగ (ఆవిరి) పసిగట్టే సెన్సార్లు ఎందుకు అలారం మోగించలేదు.. అసలు సెన్సార్లు ఉన్నాయా? ఉంటే పనిచేస్తున్నాయా? అని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ప్రమాదానికి వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజన్ కారణమా.. లేదా ఇతరత్రా సమస్య వల్ల ప్రమాదం జరిగిందా అనేది తేలాల్సి ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేస్తే తప్ప వాస్తవాలు తెలియవని ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమికల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ఆచార్యుడొకరు వివరించారు.

ఫార్మా కంపెనీల్లో ఉత్పత్తి సమయంలో అనేక రకాలైన కెమికల్స్ వినియోగిస్తారు. ఈ సమయంలో వాసన, పొగ ఉత్పత్తి లీకులను గుర్తించేందుకు ఎక్కడికక్కడ సెన్సార్లు ఏర్పాటుచేస్తారు. ఇవి పెద్ద ఖరీదు కూడా కాదు. వీటిని ఏర్పాటు చేసిన తరువాత నిరంతరం పర్యవేక్షించాలి. సెన్సార్లు లేకుండా కంపెనీల్లో ఉత్పత్తులకు అనుమతి ఇవ్వకూడదు. అయితే ఎసెన్షియా కర్మాగారం మూడో అంతస్తులో రియాక్టర్ నుంచి మరో ట్యాంకర్‌లోకి పంపే సాల్వెంట్ లీకై ఎలక్ట్రికల్ ప్యానళ్లపై పడి ఆవిరిమేఘంగా కమ్ముకుంది. ఇది ఎలక్ట్రికల్ ప్యానల్స్ నుంచి భవనంలోని అన్ని మూలలకు చేరింది. ఈలోగా ఎలక్ట్రికల్ ప్యానల్స్ ఉన్న గదిలో మంటలు రేగడంతో ప్యానల్స్ పైపుల ద్వారా క్షణాల్లో భవనం మొత్తం వ్యాపించి భారీ పేలుడు సంభవించిందని ఫ్యాక్టరీస్ డిపార్టుమెంట్ తన ప్రాథమిక నివేదికలో పేర్కొంది.

దీనిపై ఇంజనీరింగ్ నిపుణులు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు. ఇంట్లో కొద్దిగా గ్యాస్ లీకైతే వెంటనే అప్రమత్తమై సిలెండర్ వద్ద రెగ్యులేటర్ కట్టేస్తాం.. సిలెండర్ నుంచి గ్యాస్ స్టౌకు కనెక్టుచేసే పైపు తనిఖీచేస్తాం.. స్టౌ బర్నర్ కట్టేసి వంట గది కిటికీలు తెరిచి ఉంచుతాం. ఆటువంటప్పుడు కర్మాగారంలో ఎలక్ట్రికల్ ప్యానళ్ల ఉన్న గది మొత్తం ఆవిరి మేఘం కమ్మేసినపుడు తప్పకుండా వాసన వస్తుంది. గది క్లోజ్డ్ హాలు కావడంతో ఆవిరి ... మిగతా 6వ పేజీలో

ఫార్మా ప్రమాదాలపై విచారణ చేపట్టాలి

- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- అనకాపల్లిలో క్షతగాత్రులకు పరామర్శ

- వివరాలు మెయిన్ 11లో



ఉషాప్రైమ్ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ సీఎం జగన్

తాగునీటి వనరులకు పూర్వ వైభవం తేవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

- సంరక్షణకు పటిష్ట చర్యలు, సరిహద్దు గుర్తింపునకు రీ సర్వే చేయాలి
- సమీక్ష సమావేశంలో అధికారులను ఆదేశించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సహజ తాగునీటి వనరుల సంరక్షణకు సమగ్ర ప్రణాళిక రూపొందించి, పటిష్ట చర్యలు చేపట్టాలని, వాటికి పూర్వ వైభవం తీసుకురావాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ వివిధ విభాగాలకు చెందిన అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుడా ప్రణాళి కాయుత చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని తాగునీటి వనరుల సంరక్షణ, ఇతర అంశాలపై కలెక్టరేట్ మీటింగ్‌హాల్‌లో వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జల వనరుల పునరుద్ధరణ, సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని సహజసిద్ధ తాగునీటి వనరులను, మూలకేంద్రాలను, సరిహద్దులను గుర్తిస్తూ రెవెన్యూ, సర్వే విభాగాల అధికారులు సంయుక్తంగా రీసర్వే చేయాలని ఆదేశించారు. సెప్టెంబరు 30లోగా నివేదిక సమర్పించాలన్నారు. భవిష్యత్తులో తాగునీటి అవసరాలకు అనుగుణంగా ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలని, వనరులను కాపాడుకునేందుకు బాధ్యాయుతంగా కృషి చేయాలన్నారు.

జిల్లాలో ఇప్పటి వరకు 179 తాగునీటి వనరుల కేంద్రాలున్నట్టు ప్రాథమిక ఆధారాలు చెబుతున్నాయని, రీసర్వేలో మరిన్ని వెలుగులోకి వస్తాయన్నారు. సమావేశంలో ధన్ ఫౌండేషన్ ప్రతినిధులు జిల్లాలో తాగునీటి వనరులకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ వివిధ అంశాలపై మాట్లాడారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, డ్వామా పీడీ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

79 పంచాయతీల్లో గ్రామ సభలు

- గంభీరం సభకు గంటా, కలెక్టర్ హాజరు
- రూ.10 కోట్ల పనులకు ఆమోదం

విశాఖపట్నం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి మండలాల్లోని 79 పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. రూ.10 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు ఆమోదించారు. గంభీరం గ్రామసభలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిరప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సభల ద్వారా గ్రామపాలన, సమష్టి నిర్ణయాలు, ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలుస్తాయన్నారు. ప్రస్తుత ఏడాదిలో ఉపాధి పథకం ద్వారా చేపట్టనున్న పనులు, నాలుగేళ్లలో చేపట్టే పనులు, స్వర్ణగ్రామంగా తీర్చిదిద్దే క్రమంలో మౌలిక వసతులు, వ్యక్తిగత, కమ్యూనిటీ అవసరాల కోసం చర్చించడం శుభపరిణామన్నారు. ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ గ్రామసభల ద్వారా 87 రకాల పనులపై స్వయం నిర్ణయాధికారం వచ్చిందన్నారు. సభల ద్వారా గ్రామాలకు పూర్వ వైభవం వస్తుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సంక్షేమ శాఖలకు జవసత్వాలు

బీసీ, ఎస్సీలకు చేయూత అందించేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం

- ఇప్పటికే ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన మంత్రులు



విశాఖపట్నం, ఆగసు 23 (ఆంధ్రజ్యోతి):

బీసీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమశాఖల ద్వారా గతంలో టీడీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలుచేసింది. సబ్సిడీతో కూడిన రుణాలు, వాహనాలను అందించడం ద్వారా ఆయా వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అనుగుణంగా ఇవి దోహదపడ్డాయి. అయితే ఈ విధానాలకు వైసీపీ ప్రభుత్వం స్వస్తిచెప్పింది. గత ఐదేళ్లు ఈ శాఖలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. బటన్ నొక్కుడుకు మాత్రమే పరిమితమైన జగన్ ప్రభుత్వం ఈ శాఖలను పక్కన పెట్టేసింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా శాఖల ద్వారా గతంలో అమలుచేసిన అనేక పథకాలను మళ్లీ పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతోంది. ఈమేరకు ఆయాశాఖలకు చెందిన మంత్రులు కొద్దిరోజుల కిందట అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రణాళికలను రూపొందించారు. ప్రభుత్వ నిర్ణయంతో మరోసారి సంక్షేమశాఖల ద్వారా పలు పథకాలు అందుతాయనే ఆనందంలో బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలవారున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాదే కొన్ని పథకాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వీటిలో బీసీ కార్పొరేషన్ ద్వారా 40 శాతం రాయితీతో గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నారు. ఇందులో 50 శాతం బ్యాంకు రుణం, పది శాతం లబ్ధిదారుడి వాటా ఉంటుంది. స్వయం ఉపాధి యూనిట్ ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల విలువజేసే యూనిట్ ఏర్పాటు చేసుకుంటే దరఖాస్తుదారుడు రూ.20 వేలు చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం రూ.80 వేలు రాయితీ అందిస్తుంది. బ్యాంకు ద్వారా రూ.లక్ష రుణం అందుతుంది. అదే రూ.3 లక్షల విలువజేసే యూనిట్ ఏర్పాటు చేయాలని భావిస్తే.. లబ్ధిదారుడు రూ.30 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం రూ.1.2 లక్షలు రాయితీగా అందిస్తుంది. రూ.1.5 లక్షల బ్యాంకు రుణం ఇస్తారు. రూ. 5 లక్షల వరకు యూనిట్ ఖరీదుంటే.. రూ.50 వేలు లబ్ధిదారుడి వాటా... రూ.2 లక్షల ప్రభుత్వ ... మిగతా 6వ పేజీలో

సేఫ్టీ ఆఫీసర్ల నియామకంపై దృష్టి

- మార్గదర్శకాల తయారీకి సీఎం ఆదేశం
- ఎంత మంది ఉండాలనే అంశంపై సమాలోచనలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించడానికి సేఫ్టీ ఆఫీసర్ల (భద్రత అధికారులు)ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎసెన్షియా ఫార్మాలో ఆవిరి మేఘాలతో పేలుడు సంభవించి 17 మంది మరణించడంతో సేఫ్టీ ఆఫీసర్ ప్రాధాన్యాన్ని ప్రభుత్వం గుర్తించింది. అక్కడ సేఫ్టీ సూపర్‌వైజర్ లేకనే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని తేలింది. వాస్తవానికి వెయ్యి మంది ఉద్యోగులున్న ప్రతి పరిశ్రమ క్వాలిఫైడ్ సేఫ్టీ ఆఫీసర్‌ని నియమించుకోవాలి. తరువాత ప్రతి రెండు వేల మందికి మరో సేఫ్టీ ఆఫీసర్ ఉండాలి. స్టీల్‌ప్లాంటు, హెచ్‌పీసీఎల్ వంటి సంస్థల్లో వేల సంఖ్యలో ఉద్యోగులుంటారు. ఆయా చోట్ల మరింతమంది ఉండాలి. వారికి జీతభత్యాలు ఎక్కువగా చెల్లించాల్సి ఉంటుంది. దీంతో చాలా సంస్థలు నియమించుకోవడం లేదు. ఉన్నవారిలో ఒకరిద్దరికి శిక్షణ ఇప్పించి 'సేఫ్టీ సూపర్‌వైజర్' హోదాతో పని చేయించుకుంటున్నాయి. రాష్ట్రంలో ఉద్యోగుల సంఖ్యకు, సేఫ్టీ ఆఫీసర్ల సంఖ్యకు పొంతన లేదని అధికారుల పరిశీలనలో తేలింది. ఈ విషయాన్ని కార్మిక శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సీఎంకు సమస్యను వివరించారు. దీంతో వారి నియామకంపై కసరత్తు చేయాలని ఆదేశించారు.

ఇవీ విధులు

సంస్థలో ప్రమాదాలు జరగకుండా సేఫ్టీ ఆఫీసర్ జాగ్రత్తలు తీసుకోవాలి. ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్, ఎక్సటింగ్ విషర్స్ సిద్ధంగా ఉంచాలి. రెగ్యులర్‌గా మాక్ డ్రిల్స్ నిర్వహించాలి. ప్రమాదకరమైన విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ ఉపయోగించేలా చూడాలి. మండే స్వభావం, పేలే గుణం కలిగిన కెమికల్స్, సాల్వెంట్లు, పౌడర్లు వినియోగించే పరిశ్రమల్లో కార్మికులకు అవగాహన కల్పించాలి. ఇకనుంచీ ప్రతి సంస్థలో ఈ విభాగంలో శిక్షణ పొందిన వారి పర్యవేక్షణలో పనిచేసేలా చర్యలు తీసుకుంటామని పరిశ్రమల శాఖ ఉన్నతాధికారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

22ఏ నుంచి 6,704.13 ఎకరాలు ఔట్

ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ నిర్వాకమిది

- ఎక్కువ భూములు పోర్టు, ఎయిర్‌పోర్టు, హౌస్ కమిటీవే
- జాబితా నుంచి జిల్లాలోని నాలుగు మండలాల్లో 1119.04 ఎకరాలు, రూరల్‌లో 194 ఎకరాలు మినహాయింపు
- వైసీపీ కీలక నేతల ఆదేశాలతోనే అధికారుల చర్యలు



విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో విలువైన భూములను వైసీపీ నేతలు చేజిక్కించుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో తాజాగా పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నిషేధిత జాబితా (22-ఎ) నుంచి మినహాయింపు పొందిన భూముల్లో ప్రైవేటు భూములు కూడా ఉండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రధానంగా విశాఖ రూరల్, భీమిలి, ఆనందపురం మండలాల్లో మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, పొలిటికల్ సఫరర్స్‌కి ఇచ్చిన భూములకు ఎన్‌వోసీ తీసుకుని, వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించారని, దీని వెనుక వైసీపీ పెద్దల హస్తం ఉందనేది ప్రధాన ఆరోపణ.

జిల్లాలో 2019 ఏప్రిల్ ఒకటోతేదీ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ ఒకటోతేదీ వరకు అంటే ఐదేళ్లలో మొత్తం 6,704.13 ఎకరాలను 22-ఎ నుంచి తొలగించారు. ఈ మేరకు గత వారం జిల్లాలో పర్యటించిన రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దీని ప్రకారం 2019 ఏప్రిల్ ఒకటోతేదీ నాటికి జిల్లాలోని 11 మండలాల్లో 2,06,315.01 ఎకరాలు 22-ఎలో ఉండగా వాటిలో ఈ ఏడాది ఏప్రిల్ ఒకటోతేదీ వరకు 6,701.13 ఎకరాలు తొలగించారు. ఇంకా 22-ఎలో 1,99,610.09 ఎకరాలున్నాయి. అయితే ఈ ఐదేళ్లలో 22-ఎ నుంచి తొలగించిన వాటిలో ఎక్కువగా విశాఖ పోర్టు, ఎయిర్‌పోర్టు, హౌస్‌కమిటీ భూములేనని చెబుతున్నారు. ఎక్కువగా ములగాడ మండలంలో 4582.69 ఎకరాలకు గాను 2,900.79 ఎకరాలను 22-ఎ నుంచి తొలగించారు. గోపాలపట్నం పరిధిలో 7912.26 ఎకరాలకు 1,591.94 ఎకరాలు, గాజువాకలో 8,958.80 ఎకరాలకుగాను 845.56 ఎకరాలు నిషేధిత జాబితా నుంచి తప్పించారు. ఈ మూడు మండలాల్లో పోర్టు, ఎయిర్‌పోర్టు, భూములు, ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

మహారాణిపేట, ఆగస్టు 23: సాగర్ నగర్ ఇస్కాన్ మం దిరంలో ఈనెల 24వ తేదీనుంచి 27 వ తేదీ వరకు శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్స వా లు నిర్వహించనున్నట్టు ఇస్కాన్ నగర శాఖ అధ్య క్షుడు సాంబదాస ప్రభూజీ తెలిపారు. శుక్ర వారం నగరంలో ఓ హోటల్‌లో నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకృష్ణామి వేడుకలు పురస్కరించుకుని 26వతేదీన మయాపూర్ భక్త బృందంతో హరేకృష్ణ మహామంత్ర సంకీర్తన, ఉదయం 4.30 నిమిషాలకు మంగళ హారతి, 9 గంటలకు దర్శన హారతితోపాటు భక్తులతో ఉంజల సేవ, చిన్నా రులతో వేషధారణలు, యువత ఉట్టి కొట్టే సంబరాలు, నృత్య పోటీలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈ సమావే శంలో మాతాజీ నితాయి సేవిని, ఎం.వి. రాజశేఖర్, బి.హెచ్. వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.







కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో అస్తవ్యస్తంగా కార్లు



మలుపు తిరగలేక నిలిచిన ఆర్టీసీ బస్సు

అస్తవ్యస్త పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యలు

- కేజీహెచ్, కలెక్టరేట్ జంక్షన్లలో నిత్యం యాతనే..
- ఆస్పత్రుల ఎదుట రోడ్డుపై యథేచ్ఛగా వాహనాలు నిలిపివేత
- ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ అంతంతమాత్రం

మహారాణిపేట, ఆగస్టు 23: కేజీహెచ్ నుంచి కలెక్టరేట్ జంక్షన్‌కు వెళ్లే రహదారిలో ఆటోలు, ఇతర వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. జగదాంబ నుంచి కలెక్టరేట్ జంక్షన్, కేజీహెచ్ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారిలో ఈ పరిస్థితి నెలకొంటోంది. దీనితో కేజీహెచ్, ఇతర ఆసుపత్రులకు వచ్చే రోగులు, కలెక్టరేట్, జిల్లా పరిషత్ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. ప్రధానంగా జగదాంబ జంక్షన్ నుంచి వచ్చే మార్గంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చే వాహనాలు రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేస్తుండడంతో ఆర్‌టీసీ బస్సులతో పాటు అంబులెన్స్‌లు ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంటోంది. ప్రధానంగా బస్సులు వంటి భారీ వాహనాలు మలుపు తిరిగేందుకు సమస్యగా మారుతోంది. కేజీహెచ్ అవుట్ గేట్ వద్ద ఆటోలు పాసింజర్ల కోసం నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది. కేజీహెచ్ ఆసుపత్రి నుంచి అవుట్‌గేట్ ద్వారా బయటకు వచ్చేవారు కలెక్టరేట్ జంక్షన్ నుంచి వచ్చే వారి వాహనదారులు రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు కలెక్టరేట్ జంక్షన్, లేపాక్షి జంక్షన్‌ల వద్ద మాత్రమే విధుల్లో పరిమితమవుతున్నారు. సెల్‌ఫోన్‌లతో హెల్మెట్‌లేని వారు జరిమానాలు, వాహనాలు రికార్డుల పరిశీలనలతో కాలం గడుపుతున్నారు. నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బందులు తలెత్తుతున్న ప్రదేశాల్లో ఒక్క రూ కానరాకపోవడంతో విమర్శలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ట్రాఫిక్‌తో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు ఇకనైనా రద్దీగా ఉన్న ప్రాంతాలలో సిబ్బందిని ఏర్పా టు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

'కమిటీ కుర్రోళ్లు'కు ప్రేక్షకాదరణ



మాట్లాడుతున్న నిర్మాత నిహారిక, నటీనటులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 23: కమిటీ కుర్రోళ్లు సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు చిత్ర నిర్మాత నీహారిక కొణిదెల అన్నారు. శుక్రవారం రాత్రి డాబాగార్డెన్స్ సూర్యాబాగ్ శ్రీవెంకటేశ్వరథియేటర్‌లో ఈ సినిమా యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ ఈ నెల 9న విడుదలైన ఈ చిత్రం పెద్ద విజయం సాధించిందన్నారు. 1990 దశకంలో కథాంశమన్నారు. నగరానికి చెందిన ప్రసాద్, సందీప్, రుషిక ఇందులో నటించారన్నారు. దర్శకుడు యదువంశీ, చిత్ర నటులు సందీప్ సరోజ్, ప్రసాద్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూములు ఆక్రమణకు గురైతే చర్యలు

మహారాణిపేట, ఆగస్టు 23: జిల్లాలోని దేవదాయ, ఇతర ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికారదని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో భూ పరిరక్షణ జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జిల్లాలో ఇప్పటికే విలువైన భూములు ఆక్రమణ జరిగాయని, ఇకపై అలాంటి పరిస్థితి రాకుండా కాపాడాలని కోరారు. దేవదాయ శాఖ భూముల్లో సరిహద్దులు నిర్ధారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ ఉప కమిషనర్ కె. శిరీష మాట్లాడుతూ జిల్లాలో 11దేవాలయాలకు చెందిన భూములు ఆక్రమణలో ఉన్నాయని, సంబంధిత ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్‌డీవో, దేవాలయాల ఈవోలు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు రిజిస్ట్రార్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌నుంచి 26 మంది చిన్నారుల డిశ్చార్జ్



కేజీహెచ్‌నుంచి డిస్చార్జ్ చేసిన చిన్నారులతో వైద్య సిబ్బంది

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కలుషిత ఆహారం తిని అనారోగ్యానికి గురై కేజీహెచ్‌లో చేరిన చిన్నారులు కోలుకున్నారు. పూర్తి ఆరోగ్యంగా ఉండడంతో శుక్రవారం 26 మందిని వైద్యులు డిశ్చార్జ్ చేశారు. వీరంతా ఇప్పటివరకు పీడియాట్రిక్ విభాగంలోని జనరల్ వార్డులో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఆస్పత్రిలో మరో 12 మంది చికిత్స పొందుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రిలో నలుగురు చిన్నారులకు వైద్య సేవలు అందుతున్నాయి. కోలుకున్న చిన్నారులను ప్రత్యేక వాహనాల్లో స్వగ్రామాలకు తరలించారు. ఆస్పత్రి అధికారులు దగ్గరుండి వారిని వాహనాల్లోకి ఎక్కించారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, చీఫ్ డైటీషియన్ రమణమూర్తి, పీడియాట్రిక్ విభాగానికి చెందిన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

డాబాగార్డెన్, ఆగస్టు 23: హరేకృష్ణ మూమెంట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఈ నెల 25, 26వ తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు హరేకృష్ణమూమెంట్ ప్రతినిధి శ్యామా మాధవదాస తెలిపారు. శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు. నగరంలోని భక్తుల సౌకర్యం కోసం 25, 26 తేదీల్లో ఎంవీపీ కాలనీ గాదిరాజుపాలెస్‌లో వేడుకలు జరుగుతాయన్నారు. మధురవాడ, ఆనందపురం, భీమిలి భక్తులకోసం ఐఐఎం రోడ్డులోని గంభీరంలో 25,26,27 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు.

నిజాయితీకి మారుపేరు 'టంగుటూరి': కలెక్టర్



టంగుటూరి ప్రకాశం పంతులు చి త్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు



సీపీ శంఖ బ్రత బాగ్చీ..

మహారాణిపేట, ఆగస్టు 23: మాజీ ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నిజాయితీకి మారుపేరని కలెక్టర్, వక్తలు కొనియాడారు. ప్రకాశం పంతులు 153వ జయంతి కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆయన చి త్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సీఎంఆర్‌డీ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, డీఆర్‌వో కె. మోహనకుమార్ పాల్గొన్నారు. పోలీసు కమిషనరేట్‌లో కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ టంగుటూరి చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టంగుటూరి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో..

కేజీహెచ్‌లో సూప రింటెం డెంట్ శివానంద టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించారు.ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధికి టంగుటూరి చేసిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూప రింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, ఏవో జగదీష్, మేనేజర్ పీఎం జవహర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.



కేజీహెచ్‌లో నివాళులరిస్తున్న సూపరింటెండెంట్ శివానంద, వైద్య సిబ్బంది

కార్మికులతో చెలగాటం

... 5వ పేజీ తరువాయి

ఆరు నెలలు శిక్షణ అందిస్తాయి. ఆ తరువాత కూడా ఉత్పత్తి మారిన ప్రతిసారీ శిక్షణ ఇస్తుంటారు. అదే మధ్య, చిన్నతరహా కంపెనీల్లో ఫ్రెషర్స్‌ను తీసుకున్నా శిక్షణ ఉండదు. రియాక్టర్‌లో ముడిసరకులు, తరువాత సాల్వెంట్ కలిపి ప్రాసెస్ చేసేటప్పుడు ఒక ఫార్ములా ఉంటుంది. ఉదాహరణకు రియాక్టర్‌లో 100 కిలోల ముడిసరుకు వేసి ఉత్పత్తి చేయాలనుకుంటే కచ్చితంగా అంతే పరిమాణం వాడాలి.. అంతకు మించి వేస్తే ఇబ్బందులు వస్తాయి. అటువంటప్పుడు రియాక్టర్‌లో ఒత్తిడి, ఆవిరి ప్రమాణాలు పెరిగిపోతాయి. ఎక్కువ ప్రమాదాలు జరగడానికి ఇలాంటి ప్రమాణాలు పాటించకపోవడమే కారణమని నిపుణులు చెబుతున్నారు. రియాక్టర్ నుంచి సాల్వెంట్ డ్రమ్ముల్లోకి పంపి అక్కడ ఫిల్టర్ చేస్తుంటారు. తరువాత డ్రయ్యర్ విధానంలో పొడిచేసి ప్యాకింగ్ చేస్తారు. ఈ విధానం మొత్తం పూర్తయ్యేవరకు సీనియర్లు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కానీ కొన్నిచోట్ల సీనియర్ల కొరతతో జూనియర్లతో ప్రాసెసింగ్ చేస్తున్నారని బలరామ్‌నాయుడు అనే కెమికల్ ఇంజనీరు అభిప్రాయపడ్డారు. రియాక్టర్‌లో ముడిసరుకు, సాల్వెంట్ వేసిన తరువాత ప్రాసెసింగ్‌కు టైమ్ ఖరారుచేస్తారని, ఈ మధ్యలో తేడా వస్తే రిస్క్ మేనేజ్‌మెంట్ విధానం అమలుచేసి సమస్య పరిష్కరించే అనుభవజ్ఞుల కొరత ఉందని, ఇందుకు కాస్ట్ కటింగ్స్ (తక్కువ వేతనాలు) విధానం అమలుచేస్తుంటారని ఆరోపించారు.

ఇదిలావుండగా ఫార్మా, కెమికల్ కర్మాగారాల్లో ఉద్యోగులకు పక్కాగా శిక్షణ అవసరమని ఏయూ ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య సిద్ధయ్య అభిప్రాయపడ్డారు. మిగిలిన రంగాలకు భిన్నంగా ఈ కంపెనీల్లో పనిచేయాలంటే ఆయా కెమికల్స్‌పై అవగాహన అవసరమన్నారు. అయితే ఎంఎన్‌సీ కంపెనీలు మాత్రం శిక్షణ ఇచ్చిన తరువాతే విధుల్లోకి తీసుకుంటాయన్నారు.

వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజనే కారణమా?

... 5వ పేజీ తరువాయి

బయటకు వెళ్లే మార్గం లేక ఒత్తిడి పెరిగింది. కేబుల్ డక్ట్ నుంచి గ్రౌండ్‌ఫ్లోర్ మొత్తం వ్యాపించింది. దీనికి కొంత సమయం పడుతుంది. అప్పటివరకు గదిలో పొగ, వాసన విషయాన్ని సెన్సార్లు పసిగట్టి అలారం మోగాలి. అలారం మోగిందా? సెన్సార్లు ఉన్నాయా? ఒకవేళ ఉండీ పనిచేయడంలేదా? మోగినా పనిలో ఉన్న వారు గుర్తించలేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సెన్సార్లు మోగకుంటే మరేదైనా కారణంతో ప్రమాదం జరిగిందా? అన్న అనుమానం వ్యక్తమవుతోంది. రియాక్టర్‌ల నుంచి సాల్వెంట్ డ్రమ్ములోకి పంపేటపుడు పైపులు లీకైనా వెంటనే సెన్సార్లు అప్రమత్తంచేస్తాయి. మూడో అంతస్థులోనూ సెన్సార్లు ఏర్పాటుచేయలేదా? అని ఇంజనీరింగ్ నిపుణులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

ఇదిలావుండగా కర్మాగారంలో పీరియాడికల్‌గా తనిఖీలు చేయకపోవడంతోనే ఎసెన్షియాలో ప్రమాదం జరగడానికి కారణంగా పేర్కొంటున్నారు. ఉత్పత్తులకు తగిన విధంగా కర్మాగారం సిద్ధంగా లేకపోతే అనుమతులు ఇవ్వకూడదని స్పష్టంచేశారు. తాజా ఘటన నేపథ్యంలో కర్మాగారంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని సూచిస్తున్నారు. ఎసెన్షియా కంపెనీ ఘటనతో ఉమ్మడి జిల్లాలో అన్ని కర్మాగారాల్లో సెన్సార్లు, ఇతర పరికరాలు ఉన్నాయా? అన్నది సంబంధిత అధికారులు తనిఖీలుచేసి, అవి సక్రమంగా పనిచేసేలా ఆదేశాలు ఇవ్వాలని సూచిస్తున్నారు.

సంక్షేమశాఖలకు జవసత్వాలు

... 5వ పేజీ తరువాయి

రాయితీ, బ్యాంకు నుంచి రూ.2.5 లక్షలు రుణం ఇస్తారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి అమలుచేయాలని భావిస్తున్న యూనిట్లు విలువ కూడా దాదాపుగా ఇంతే ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తాలతో ఉపాధి ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. డైరీ ఫామ్, కోళ్లఫామ్, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తుల తయారీ, తేనె పట్టు పెంపకం ఏర్పాటు చేసుకోవవచ్చని అధికారులు చెబుతున్నారు. వీటితోపాటు కుల సంఘాలకు కూడా సబ్సిడీతో రుణాలను అందించనున్నారు. కార్లు, ట్రాక్టర్లు, ట్రాక్టర్ పరికరాలు, ఆటోలు, వ్యాన్లు వంటివి అందించనున్నారు.

లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు

కూటమి ప్రభుత్వం అమలుచేయాలని భావిస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులను ఎలా ఎంపిక చేయాలన్న దానిపై కసరత్తు జరుగుతోంది. ఒక్కో జిల్లాకు ఎన్ని యూనిట్లు కేటాయిస్తారన్న దానిని బట్టి లబ్ధిదారుల ఎంపిక ఉండాలన్నది ప్రభుత్వ ఆలోచన. దరఖాస్తులు స్వీకరిస్తే భారీగా వచ్చే అవకాశం ఉందని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దరఖాస్తులు తీసుకోకుండా మంజూరు చేయడం అనేక ఇబ్బందులకు కారణమవుతుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులను నేరుగా ఆయాశాఖలు ఆధ్వర్యంలో ఎంపిక చేయాలా..? స్థానిక ప్రజాప్రతినిధులకు అప్పగించాలా..? అన్నది తెలియాల్సి ఉంది. గతంలో సంక్షేమశాఖలకే నేరుగా దరఖాస్తులు అందజేసేవారు. ఇక్కడి నుంచే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరిగేది. ఈ శాఖల ఆధ్వర్యంలోనే రుణాలు, వాహనాలను అందించేవారు. రుణాల రికవరీ బాధ్యతను కూడా ఆయా శాఖల అధికారులే పర్యవేక్షించేవారు. ఈ పథకాల్లో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాకు కనీసం ఐదు వేల వరకు యూనిట్లు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

6,704.13 ఎకరాలు ఔట్

... 5వ పేజీ తరువాయి

పేదలకు పట్టాలు ఇచ్చిన భూములు, గాజువాకలో హౌస్‌కమిటీ 22-ఎ నుంచి తప్పించారని చెబుతున్నారు. మొత్తంగా 22-ఎ నుంచి తప్పించిన 6,701.13 ఎకరాల్లో రెగ్యులర్ ప్రాసెస్‌లో 5,724.31 ఎకరాలున్నాయి. వీటిలో మూడు మండలాల్లో పోర్టు, ఎయిర్‌పోర్టు, పేదలకు ఇచ్చిన పట్టాలు, హౌస్ కమిటీకి చెందిన భూములు 5,338.29 ఎకరాలున్నాయి. ఇంకా భీమిలిలో 67.63 ఎకరాలు, ఆనందపురంలో 46.32 ఎకరాలు, మహారాణిపేటలో 1.27 ఎకరాలు, పద్మనాభంలో 10.88 ఎకరాలు, పెదగంట్యాడలో 8.1 ఎకరాలు, పెందుర్తిలో 20.58 ఎకరాలు, సీతమ్మధారలో 36.38 ఎకరాలు, విశాఖ రూరల్‌లో 194.86 ఎకరాలను 22-ఎ నుంచి రెగ్యులర్ విధానంలో తొలగించారు. ఇంకా పేదల ఇళ్ల కోసం సేకరించిన భూములకు పరిహారంగా రైతులకు 369.9 ఎకరాల్లో ప్లాట్లు కేటాయించడంతో వాటిని 22-ఎ నుంచి తొలగించారు. 609.93 ఎకరాల డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేయడంతో వాటిని నిషేధిత జాబితా నుంచి తప్పించారు. వీటిలో ఎక్కువగా ఆనందపురంలో 407.77 ఎకరాలు, భీమిలిలో 52.513 ఎకరాలు, పద్మనాభంలో 129,6 ఎకరాలు, పెందుర్తిలో 20.04 ఎకరాలున్నాయి. నిషేధిత జాబితా నుంచి నాలుగు గ్రామీణ మండలాల్లో తొలగించిన భూములు 1119.04 ఎకరాలున్నాయి.విశాఖ రూరల్ మండలంలో 194.86 ఎకరాలు తొలగించారు. ఫ్రీహోల్డ్ భూములు, ల్యాండ్ పూలింగ్ భూములు మినహాయించి చూస్తే స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులు, పొలిటికల్ సఫరర్లకు చెందిన భూములు, వివాదాస్పదంగా గతంలో గుర్తించిన భూములను 22-ఎ నుంచి తొలగించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ భూముల్లో 516.9 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. వాటిలో ఆనందపురంలో 203.29 ఎకరాలు , విశాఖ రూరల్ మండలంలో 108.02 ఎకరాలున్నాయి. రిజిస్ట్రేషన్ అయిన భూముల్లో ఎక్కువగా గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తులు, వారి బంధువులు, స్నేహితులు కొనుగోలుచేశారనే ఆరోపణలున్నాయి.



వైద్య సిబ్బందికి సమయపాలన తప్పనిసరి

- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

సీతమ్మధార, ఆగస్టు 23: వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు ఆదేశించారు. నగరంలోని మద్దిలపాలెం, బాపూజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆయన శు క్రవారం సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, మలేరియా, డెంగ్యూ, అడల్ట్ బీసీజీ వాక్సిన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరోగ్య సిబ్బంది ఎఫ్ఆర్ఎస్ హాజరు వేయాలని, లీవ్ రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్లనుసక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఏఎన్ఎంస్, ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లు గర్భిణులకు ఐరన్ మాత్రలు అందచేయాలన్నారు ఏఎన్ఎంఎస్, ఆశా కార్యకర్తలు సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. కీటక జనిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో ఎన్‌హెచ్ఎం ఆరోగ్య కేంద్ర వైద్యులు బి.ఉమాపతి, ఎంపీహెచ్ఈవో,సిబ్బంది నాగభూషణం పాల్గొన్నారు.

డీఆర్ఎం తనిఖీలు



పెందుర్తి రైల్వే స్టేషన్ వద్ద పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 23: వాల్తేరు డివిజన్ పరిధిలోని విశాఖ, విజయనగరం సెక్షన్‌లో డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ శుక్రవారం పర్యటించారు. కొత్తవలస, పెందుర్తి స్టేషన్‌లలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులతోపాటు భద్రతా ఆడిట్‌ను తనిఖీ చేశారు. కొత్తవలస స్టేషన్‌లో ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్, పాయింట్లు, క్రాసింగ్, ట్రాక్ సర్క్యూట్ నిర్వహణలో పాటిస్తున్న భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించారు. అలాగే, యార్డు లే అవుట్, ట్రాక్, సిగ్నలింగ్ సిస్టమ్‌లను పరిశీలించారు. స్టేషన్‌లో అమృత స్టేషన్ పథకంలో భాగంగా చేపట్టిన 12 అడుగుల వెడల్పు గల పాదచారుల వంతెన నిర్మాణం, పార్కింగ్ సౌకర్యాలు, భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అక్కడ నుంచి పెందుర్తి స్టేషన్‌కు చేరుకుని ప్రయాణికుల మెరుగుపరచాల్సిన సదుపాయాలపై అధికారులతో చర్చించారు. ఈ పర్యటనలో ఏడీఆర్ఎం సుధీర్‌కుమార్ గుప్తా, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం



వేదికపై అధ్యాపకులతో విద్యార్థులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 23 : గ్రేటర్ 44వ వార్డు తాటిచెట్లపాలెంలోని పీఎం కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో శుక్రవారం అంతరిక్ష దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చంద్రయాన్-3 నేపథ్యంలో విద్యార్థుల లఘునాటిక ప్రదర్శించారు. అనంతరం ఇస్రో విజయాలపై విద్యార్థులు ప్రసంగించారు. శాస్త్రవేత్తలు, విద్యార్థుల మధ్య ఇంటర్వ్యూ పేరిట అభినయించారు. తర్వాత చంద్రయాన్-3పై క్విజ్ పోటీలు నిర్వహించారు. వి ద్యార్థులు వర్ణచిత్ర ప్రదర్శనను ప్రిన్సిపాల్ కమల్‌జిత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు నిధి, రవికుమార్, యర్రయ్య కమల రాణి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి శ్రావణ పూజలు



అలంకరణలో అమ్మవారు

జగదాంబ కూడలి, ఆగస్టు 23: వన్‌టౌన్ కనకమహాలక్ష్మి ఆల యంలో శ్రావ ణ శుక్రవారం పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రావణలక్ష్మీ హోమం, కుంకుమ పూజల్లో 230 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయం శ్రావణశోభతో వెలుగులీనుతుంది. భక్తులు ఉదయం నుంచి దర్శనానికి బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

కనకమహాలక్ష్మి నిత్యాన్నదానికి నగరానికి చెంది గరిమెళ్ల సూర్యవెంకటలక్ష్మీనారాయణ దివంగత భార్య వెంకట సీతామహాలక్ష్మి పేరిట రూ. లక్ష విరాళంఅందించారు. ఈ చెక్కును జేఈవో వి.రాంబాబుకు అందజేశారు. దాతకు ప్రత్యేకదర్శనంతోపాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శాకంబరిదేవిగా పార్వతీదేవి



కూరగాయల అలంకరణలో పార్వతీదేవి

సీతంపేట: సీతంపేటలోని పార్వతీశ్వర ఆలయంలో శ్రావణమాసం మూడో శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకంబరి దేవి అవతారంలో అలంకరించారు.భక్తులు కుంకుమ అర్చనలు చేశారు. అర్చకులు భాస్కర్ శర్మ, శివాజీశర్మలు అమ్మవారికి ప్రత్యేక నామాలతో పూజలు జరిపించారు.

పర్యావరణంతో జీవరాశి మనుగడ

కంచరపాలెం, ఆగస్టు 23: పర్యావరణ పరిరక్షణతో భావితరాల మనుగడ సాధ్యమని గీతం యూనివర్సిటీ పర్యావరణ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కొల్లి సురేష్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏడో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులతో శుక్రవారం చమురు రసాయనాలు, ఆయిల్ నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలపై టెక్నికల్ టాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఎస్‌టీడీ విశాఖ, ఐఎస్‌టీడీ చాప్టర్ కెమికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పర్యావరణం పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రొ.సురేష్ మాట్లాడుతు పర్యావరణానికి ముప్పు జరిగితే మానవళి మనుగడ ప్రశ్నార్థంగా మారుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డా.ఓఆర్ఎం రామ్, డా.ముఖేశ్, డా.బి.దేముడు.బి.వి.లక్ష్మణరావు, ప్రశాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.



ప్రొ.సురేష్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

CLASSIFIEDS

CHANGE OF NAME

I, SINGAMPALLI THRINATH (New Name), S/o. Singampalli Govind, previously called SINGAMPALLI THIRINATH (Old Name) resident of Block No.5, G-8, JNNURM Colony, Gnanapuram, Visakhapatnam-530004. Now changed my name from SINGAMPALLI THIRINATH (Old Name) to SINGAMPALLI THRINATH (New Name) for all purpose.

CHANGE OF NAME

I, MAKKUVA ANITHA RANI (New Name), W/o. Makkuva Ravi Shankar, previously called NANDI ANITHA (Old Name) resident of 39-4-5/3/13, 4th Floor, Flat No.14, Sai Lalitha Residency, Muralinagar, Visakhapatnam-530007, Andhra Pradesh. Now changed my name from NANDI ANITHA (Old Name) to MAKKUVA ANITHA RANI (New Name). Henceforth I will be called as MAKKUVA ANITHA RANI (New Name) for all purpose.

PLOT FOR SALE

VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీ గంధం, ఎర్రచందనం మొక్కలతో చ.గ. 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్, ఫామ్ హౌస్ ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర : 9121884889

AJB-53

COMMERCIAL SPACE FOR SALE

★ 4000 sft. (Comm.) in G.F. & 1250 sft. (3 BHK) in Fourth Floor at Gopalapatnam Main Road for Sale. Cont.: 9849116584

AJV_192582

PLOT FOR SALE

★ CRDA approved Chodavaram, Vijayawada gated layout Plots, 15 minutes from Benz Circle beautiful location between Krishna River & KEB Canal. M-9948099840, 9866602266 AJH-98269

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్లని చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 18k. Ph: 9160900024, 9640400073 AJH-16356

For Advertisement Contact : 9963231176 9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పైడిమాంబను దర్శించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్

అగనంపూడి, ఆగస్టు 23 : జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ ఏదూరివానిపాలెం, పరిసర ప్రాంత ప్రజల ఆరాధ్య దేవత పైడిమాంబ అమ్మవారిని విశాఖ సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక జనసేన నేతలు 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలు ఎంతో స్వేచ్ఛగా ఉన్నారన్నారు, అభివృద్ధి, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్న లక్ష్యంతో అంతా ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అయితి అప్పలరాజు, ఏదూరి గౌరినాయుడు, బంధం అప్పలరాజు, వెంకట అప్పారావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రారంభించండి


డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

అగనంపూడి, ఆగస్టు 23 : అన్నపూర్ణనగర్, చీకటివీధి ప్రాంతాల్లో జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా గతంలో మంజూరు చేసిన పనుల గురించి జీవీఎంసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి పనులు ప్రారంభించాలని అధికారులను సూచించారు. అనంతరం ఆయన నివాసితులతో మాట్లాడారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాడిశ కనకరాజు, కరణం సత్యారావు, సిండిగి సింహాచలం, నాగేశ్వరరావు, గోవిందరావు తదితరులు పాల్గొనారు.

ఉక్కులో కాంట్రాక్టు కార్మికులకు చిక్కులు

» సమస్యల పరిష్కారానికి ఎదురుచూపులు » వచ్చే నెల నుంచి జీతాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్న కాంట్రాక్టర్లు » యాజమాన్యం తక్షణమే స్పందించాలని వేడుకోలు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 23 : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు సమస్యల పరిష్కారానికి ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా జీతాల విషయంలో వారంతా చాలా ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక సమస్యల్లో చిక్కుకున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని విభాగాల్లో అయితే ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. ఇదిలావుంటే, ఇటీవల కాలంలో కాంట్రాక్టర్లు సమావేశమై కాంట్రాక్టర్ల బిల్లులు సకాలంలో ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు క్లీయర్ చేయాలని, లేని పక్షంలో వచ్చే నెల జీతాలు ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. దీంతో వచ్చే నెల జీతాలు ఇస్తారో లేదో అని కాంట్రాక్టు కార్మికులు భయపడుతున్నారు. ప్లాంట్‌లో శాశ్వత ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని వారంతా కోరుతున్నారు. ప్లాంట్‌లో దుమ్ము, ధూళిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు అలవెన్స్‌తో పాటు వైద్య సదుపాయం కల్పించాలని అంటున్నారు. కార్మికులకు స్థానిక జనరల్ ఆస్పత్రిలో వైద్య సదుపాయం కల్పించే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా 60 సంవత్సరాల వయస్సు నిండిన కార్మికులను తొలగించినప్పుడు వారికి ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు కల్పించక పోవడంతో దుర్భర జీవనాన్ని గుడుపుతున్నారన్నారు. వీరి స్థానంలో వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని కార్మిక నాయకులు కోరుతున్నారు. అదే విధంగా కాంట్రాక్టు కార్మికుల వాహనాలను అనుమతించాలని కార్మికులు అంటున్నారు. స్టీల్‌ప్లాంట్‌లోకి కాంట్రాక్టు కార్మికుల సైకిళ్లే తప్ప ఎటువంటి వాహనాలకు అనుమతి లేదు. సీఐఎస్‌ఎఫ్ అధికారుల ప్రత్యేక అనుమతి వుంటేనే కాంట్రాక్టు కార్మికుల వాహనాలను ప్లాంట్‌లోకి అనుమతిస్తారు. ప్లాంట్ శాశ్వత ఉద్యోగులకైతే ఎటువంటి ఇబ్బంది లేదు. ప్లాంట్‌లో సుమారు 11 వేల మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరు ప్లాంట్‌లోకి వెళ్లాలంటే తమ ద్విచక్ర వాహనాలను గేటు బయటే పార్క్ చేసి వెళ్ళాల్సిందే. ఈ సమస్యలన్నింటిపైనా యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా వేడుకుంటున్నారు.



అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు


మాతృశ్రీనగర్‌లో విశేష అలంకరణ లో కాశీఅన్నపూర్ణ దేవి అమ్మవారు


70వ వార్డు డ్రైవర్సు కాలనీలో దుర్గమ్మకు కుంకుమతో అభిషేకం


లక్ష్మీపురం త్రిశక్తి ఆలయంలో అమ్మవార్లకు భక్తుల పూజలు

కూర్మన్నపాలెం, ఆగస్టు 23 : శ్రావణ మాసం మూడవ శుక్రవారం సందర్భంగా వివిధ అమ్మవార్ల ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. హోమాలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. జీవీఎంసీ 86 వార్డు మాతృశ్రీనగర్‌లో ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతి ఆధ్వర్యంలో కాశీఅన్నపూర్ణదేవిని గాజులతో అలంకరించారు. ప్రధాన అర్చకులు వ్యాగ్యేశ్వరరావు శర్మ పర్యవేక్షణలో లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమ పూజలు జరిపారు. 88వ వార్డు గ్రీన్‌సిటీలో శ్రీదేవి భూదేవి సమేత వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారికి ప్రధాన అర్చకులు ఇరగవరపు వాసుస్వామి పర్యవేక్షణలో వివిధ రకాల పండ్లతో అలంకరించారు. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. 87వ వార్డు గవర వీధిలో కనక దుర్గమ్మ ఆలయంలో ప్రధాన అర్చకులు వెంకట్రావు శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, ఇదే వార్డు లక్ష్మీపురంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా దుర్గాలమ్మ, నూకాలమ్మ, ప్రోలిపిల్లమ్మ అమ్మవార్ల ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు వాసుస్వామి, హరీష్ శర్మ, సుధీర్ శర్మలు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి, విశేషంగా అలంకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు అవిరెడ్డి సూర్యనారాయణ, కుచ్చర్లపాటి రామరాజు, సిరసపల్లి బాబూరావు, కనకారావు, ఎ.పెంటారావు, విశ్వ ప్రసాద్, సింహాచలం, బి.అప్పలరాజులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. 70వ వార్డు ఎల్‌వీ నగర్‌లో కనకదుర్గమ్మ ఆలయంలో అర్చకులు కృష్ణశర్మ పర్యవేక్షణలో ప్రత్యేక అలంకరణలు జరిపారు. డ్రైవర్సు కాలనీలోని కనక దుర్గమ్మ ఆలయంలో అర్చకులు సోమేశ్వర శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.

అగనంపూడి : జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరసర ప్రాంత గ్రామాల భక్తులు దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా, విష్ణుసహస్రనామ పారాయణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి నిర్వాహకులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

కర్ణవానిపాలెం లే అవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

» ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్


తహసీల్దార్ శ్రీవల్లితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

అగనంపూడి, ఆగస్టు 23 : కర్ణవానిపాలెం ఉక్కు నిర్వాసితులకు కేటాయించిన లే అవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఉక్కు భూసేకరణలో ఇళ్లు కోల్పోయిన కర్ణవానిపాలెం నిర్వాసితులకు స్థానికంగా సర్వే నంబరు 56లో కేటాయించిన ఇళ్ల స్థలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాని, నిర్వాసితులంతా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మించేందుకు అంచనాలను రూపొందించాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులు ఎలాంటి సమస్యలున్నా తనదృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీవల్లి, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, స్థానిక నాయకులు కర్రి దోశేంద్ర, చిత్త కనకరాజు, కరణం జగదీశ్, కరణం పైడిరాజు, సత్యారావు, సింగిడి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనపై అవగాహన



మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాస్, వేదికపై టీచర్లు

పెదగంట్యాడ, ఆగస్టు 23 : జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా నడుపూరు జిల్లా పరిషత్తు ఉన్న పాఠశాలలో వివిధ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థలు సాధించిన విజయాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థలు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందాయని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ విద్యార్థులకు వివరించారు. అంతరిక్షంలో ప్లానిటరీ నమూనాలను ప్రదర్శించారు. చంద్రయాన్‌లో అత్యంత కీలకమైన ల్యాండర్ నుంచి రోవర్ బయటకు రావడం అనే అంశాన్ని నమూనాల ద్వారా ప్రదర్శించారు. రాకెట్ ఏ విధంగా పని చేస్తుందో నమూనాల ద్వారా వివరించారు. ఆస్ట్రోనాట్ దుస్తులను ప్రదర్శించారు. ఇస్రో ప్రధాన ఘట్టాలను ఉపాధ్యాయులు వరలక్ష్మి, సుహాసిని, సుబ్బలక్ష్మి వివరించారు. అంతరిక్షపరిశోధనా సంస్థలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలను ఈ సందర్భంగా అభినందించారు.

'ఉక్కుపై కేంద్ర ప్రభుత్వ వైఖరి మారాలి'

కూర్మన్నపాలెం, ఆగస్టు 23 : ఉక్కుపై కేంద్ర ప్రభుత్వ వైఖరి మారాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో కార్మికులు చేపట్టిన నిరాహార దీక్షలు శుక్రవారం 1289వ రోజుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలన్నారు. ఎన్ఎండీసీ నుంచి రా మెటీరియల్ ఇప్పించేలా కూటమి నాయకులు యత్నించాలన్నారు. కోల్ అందుబాటులో లేక పోవడంతో బీఎఫ్-1ను మూసివేశారని, షట్‌డౌన్ పేరుతో బీఎఫ్-3ని మూసివేయడం అన్యాయమని వాపోయారు. ఉక్కు కర్మాగారం మనుగడకు అవసరమైన ఆర్థిక వనరులు అందించాలని డిమాండ్ చేశారు. ఉక్కు కార్మికులు పాల్గొన్నారు.

జీతాల చెల్లింపులో యాజమాన్యం నిర్లక్ష్యం తగదు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 23 : స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం తగదని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్లాంట్‌లో ఉద్యోగులకు జీతాలు ఇవ్వటంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతుందన్నారు. కార్మికులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వీటిని యాజమాన్యం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


ప్లాంట్‌లో ధర్నా చేస్తున్న ఇంటక్ నాయకులు

ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, బీఎన్.రాజు, ఎస్ఏ.నాయుడు, రాథోడ్ పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గోపాలపట్నం, ఆగస్టు 23: స్థానిక మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5, 6, 7, 9 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. పాఠశాలలో 5వ తరగతిలో 19 సీట్లు, 6వ తరగతిలో 15 సీట్లు, 7వ తరగతిలో 5 సీట్లు, 9వ తరగతిలో 6 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 17 సీట్లు, బైపీసీలో 3 సీట్లు ఖాళీ ఉన్నట్లు ఆమె తెలిపారు. అభ్యర్థులు (ఎస్సీ/ఎస్టీలు మాత్రమే) ఆధార్‌కార్డు, టీసీ, స్టడీ సర్టిఫికెట్, రేషన్‌కార్డు కాపీలతో ఈ నెల 30లోగా పాఠశాలకు వచ్చి అడ్మిషన్‌లు పొందవచ్చని తెలిపారు.

సినిమా గైడ్

- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** సంగం, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), విశేష్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **తంగలాన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), తాతా (తగరపువలస)
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, శ్రీకన్య (గాజువాక)
- **ఆర్.కె.పురంలో :** శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు44, టమాటా 25, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 22, పచ్చి మిర్చి 46, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజ్ 26, క్యారేట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 34, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 120, బరబాటి 24, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 30, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరి కాయ (పెద్దది) 23,బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 40, కీర దోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమ దుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర(పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు60,బూడిదగుమ్మడికాయ30,కర్రపెండలం28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై కొరడా

» రెవెన్యూ శాఖ దూకుడుగా చర్యలు

పెందుర్తి, ఆగస్టు 23: ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు సత్వర చర్యలు చేపడుతున్నారు. ఇటీవల మండలంలో గెడ్డ,వాగు, చెరువుల్లో సుమారు 18 ఎకరాలు ఆక్రమించి నిర్మించిన 414 గుర్తించి ఆ ఇళ్ల యజమానులకు సెక్షన్ 7 కింద నోటీసులు జారీ చేశారు. వీటిని తదనంతరం శాఖపరమైన చర్యలకు రెవెన్యూ ఉపక్రమిస్తోంది. ఈ క్రమం లో సుజాతనగర్‌లోని సుమారు 25 ఎకరాల విస్తీర్ణం గల చెరువును సర్వే నిర్వహించారు. ఇందులో భారీ సంఖ్యలోని ఆక్రమణలను గుర్తించారు. పోలీసు బందోబస్తుతో ఈ ఆక్రమణల్లో తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో కొన్నింటిని తొలగించారు. పెందుర్తిలోని సర్వే నంబర్ 117లో ప్రభుత్వ భూమి ఆక్రమణ,చీమలాపల్లిలో ప్రభుత్వ భూమి పరాధీనం కావడంతో రెవెన్యూ అధికారులు వీటిని అడ్డుకట్ట వేశారు. ఈక్రమంలోనే ప్రభుత్వభూములు ఆక్రమణలు, తొలగించి స్వాధీనం చేసుకున్న భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుకు సిద్ధం చేశారు.

హెచ్చరిక బోర్డులు ఇలా ఏర్పాటు.. అలా తొలగింపు

రెవెన్యూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసిన ఆక్రమణదారులు వాటిని మాయం చేస్తున్నారు. ఇటీవల లక్ష్మీపురం, పాపయ్యరాజుపాలెంలో ఆక్రమిత భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినా కొంతమంది తొలగిస్తున్నారు. పులగాలిపాలెంలో సంఖ్య 98, పెందుర్తిలో సర్వే సంఖ్య 120లో (విజయరామచెరువు) పెందుర్తిలో 150లో గెడ్డపోరంబోకు, పెందుర్తిలో 126 సర్వే సంఖ్యలో గెడ్డపోరంబోకు, పెందుర్తి గోకాడ చెరువు సర్వే సంఖ్య 230, పెందుర్తి శారదానగర్ సర్వే సంఖ్య 277, చిన ముషిడివాడ 113, 165, 196, సుజాతానగర్‌లో 171, చీమలాపల్లిలో సర్వే సంఖ్యలో 24, 32, 26,55 పురుషోత్తపురంలో 27-1లో, పాపయ్యరాజుపాలెంలో 116-2లో, 117-2, ఇలా ప్రభుత్వ భూముల్లో ఏర్పాటుచేసిన కొన్నిరోజుల్లోనే బోర్డులు మాయమయ్యాయి. చినముషిడివాడ సప్తగిరినగర్‌లో 122/2/3లో ప్రభుత్వస్థలంలోనూ ఇదే పరిస్థితి. ఇక్కడి స్థలాల్లో నిర్మాణాలను ఆక్రమణలను తొలగిస్తున్నా మళ్లీ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఈ స్థితిలో ఇప్పుడు మళ్లీ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.


సిద్ధం చేసిన హెచ్చరిక బోర్డులు

సమాజాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

» కేవీ విద్యార్థుల యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్

మల్కాపురం, ఆగస్టు 23: సమాజ అభివృద్ధి, మార్పుల్లో విద్యార్థులు, యువత ఎంతో కీలకమని విశాఖ ఎంపీ శ్రీ భరత్ పేర్కొన్నారు. మల్కాపురం కేంద్రీయ విద్యాలయంలో 35వ రీజనల్ యూత్ పార్లమెంట్ కాంపిటీషన్ శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. యువత ప్రజాస్వామ్య వ్యవస్థపై లోతైన రీతిలో అవగాహన పెంపొందించుకోవాలన్నారు.భవిష్యత్తులో ఆలోచనాత్మకమైన, సమర్థవంతమైన నేతలుగా ఎదగడానికి సన్నద్ధం కావాలని ఆకాంక్షించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

విద్యార్థుల నిర్వహించిన యూత్ పార్లమెంట్ ఆకట్టుకుంది. పాఠశాలలో ఓగదిని పార్లమెంటరీహాల్‌గా మార్చి, విద్యార్థులంతా ఎంపీలుగా అవతరమెత్తారు. కుర్చీలపై మైక్‌ల పట్టుకుని, పార్లమెంటరీ సమావేశాలను తలపించే విధంగా విద్యార్థులు చూపరులను ఆకట్టుకున్నారు. ఈ యూత్ పార్లమెంటరీ కార్యక్రమంలో ఎనిమిది పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రస్తుత సమాజంలో సమస్యలు, వాటి పరిష్కారాలు, పార్లమెంట్‌లో నియమాలపై ఆసక్తిగా చర్చించారు. లోక్‌సభలో సభ్యులు మాట్లాడే తీరు.. చర్చించే అంశాలపై ఎంపీలు ఏ విధంగా వ్యవహరిస్తారో అదే రీతిగా చిన్నారులు వ్యవహరించి అందరి మన్ననలు పొందారు. ఈ యూత్ పార్లమెంట్‌ను వీక్షించిన ఎంపీ శ్రీభరత్ విద్యార్థులు అభినందనలతో ముంచెత్తారు. ఇటీవల పార్లమెంటలో చోటుచేసుకున్న కొన్ని సంఘటనలు వివరించారు.


యూత్ పార్లమెంట్‌లో వీక్షిస్తున్న ఎంపీ శ్రీభరత్

ఉపాధి పనులపై గ్రామ సభలు



రాంపురంలో నిర్వహించిన గ్రామసభలో అధికారులు

పెందుర్తి, ఆగస్టు 23: రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణ గ్రామ పంచాయతీ పేరిట తలపెట్టిన ఉపాధి గ్రామసభలు శుక్రవారం మండలంలోని పలు పంచాయతీల్లో ప్రారంభమయ్యాయి. సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు అంశాలపై చర్చించి ప్రజలు తీర్మానం చేశారు. ఈ క్రమంలో మొదటి అంశంలో ఇళ్లకు విద్యుత్. తాగునీటి కనక్షన్, వంట గ్యాస్ కనక్షన్, మరుగుదొడ్డి సదుపాయం ఉంది. రెండోది మురుగు కాలువలు, మురుగు నీటి వ్యవస్థ నిర్వహణ, వీధి దీపాలు సీసీ రోడ్లు, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, గ్రామాల్లో రహదారులనిర్మాణం, ఇంకుడు గుంతలు, పంట కాలువ లు, ఉద్యానవన పంటలు తదితర అంశాలపై చర్చించారు. రాంపురంలో సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష అధ్యక్షతన జరిగిన ఈ గ్రామ సభలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, ఎస్‌ఆర్ పురంలో సర్పంచ్ దూది విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో ఎంపీపీ మధుపాడ నాగమణి, పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి స్వాగతం

గోపాలపట్నం, ఆగస్టు 23: అచ్యుతాపురం ఫార్మకంపెనీ ప్రమాదంలో గాయపడిన బాధితుల పరామర్శించడానికి నగరానికి విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికి వైసీపీ నేతలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 10.45 గంటలకు విజయవాడ నుంచి విశాఖ విమానాశ్రయానికి జగన్మోహనరెడ్డి చేరుకున్నారు. అనంతరం ఆయన నగరానికి రోడ్డు మార్గంలో చేరుకున్నారు. బాధితులను పరామర్శించిన తరువాత మధ్యాహ్నం 1.45కి విమానాశ్రయానికి చేరుకుని 2.10 గంటలకు బెంగళూరు బయలుదేరి వెళ్లారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఏర్పాట్లు

పెందుర్తి రూరల్, ఆగస్టు 23: గ్రేటర్ 95వ వార్డు పరిధి లక్ష్మీపురం గవర పాలెం కాలనీలోని శ్రీగోపాలకృష్ణ దేవాలయంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి (గోకులాష్టమి) మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని శోభాయమానంగా తీర్చి దిద్దుతున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు, భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్లు అయిన శ్రీ గ్రంధి రాంజీ మరియు ఆతని భార్య గ్రంధి అనుపమ, డోర్ నెం.2-22/211/TL-09, Tulip Villa, Pancrama Hills, Yendada, Visakhapatnam వారికుపరూ ఇచ్చిన లోగట్టుపై తెలియజేయునది ఏమనగా !

నా క్లయింట్లుకి శ్రీమతి గోరంట్ల కృష్ణప్రసాద్ గారి భార్య శ్రీమతి గోరంట్ల రజనీకుమారి, చినవాల్తేరు, విశాఖపట్నం వారి పేరున గల విశాఖపట్నం జిల్లా గాజువాక సబురి, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్‌లో చేరిన పెదగంట్యాడ మండలం, పెద గంట్యాడ గ్రామం తాలూకా సర్వే నెం.202/6నుల్ భాగమైనట్టి యు1.00 సెంట్లు లేక 0.405 హెక్టార్లు విస్తీర్ణం గల జిరాయితీ మెట్టు భూమినకు చెందిన గాజువాక సబురి నందు క్రయదస్తావేజు 3871/2005 నెంబరుగా రిజిస్టర్ కాబడిన తరువాత 11-7-2007న నా క్లయింట్లుకు రెండు భాగాలుగా విడివిడిగా విక్రయించినారు.

ఈ ఒరిజినల్ దస్తావేజు నెం.3871/2005 నా క్లయింట్లు ఎండాడ, విశాఖపట్నం వారి ఇంటి నుండి పెదగంట్యాడలో గల వారి ఆఫీసుకి ప్రయాణము చేయుచుండగా తేది.17-08-2024న పోయినది. దీనిపైన వారు 22-08-2024న ఫిర్యాదు కూడా ఇచ్చియున్నారు. కావున ఎవరికైనను సదరు ఒరిజినల్ క్రయదస్తావేజు దొరికిన యెడల ఈ క్రింద తెలిపిన చిరునామాకు లేదా మా క్లయింట్లుకు అందజేయ వలసినదిగా కోరడమైనది.

P. Subba Reddy, B.Ch. Rajesh Thadi & G.N. Pushpasree
Advocates
D.No 4-43-17, Flat No.504, Venkatagiri Villa, Gandhi Centre, Pedda Waltair, Viskhapatnam.
Ph : 73862 39666

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు


పసుపు కొమ్ముల అలంకరణలో కనకదుర్గ

పెందుర్తి, ఆగస్టు 23: చినముషిడివాడ సప్తగిరినగర్‌లో కొలువైన అలివేలు మంగాదేవి ఆలయంలో శ్రావణమాస శుక్రవారం పూజలు వైభవంగా జరిగాయి. ఆలయప్రాంగణంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. వెంకటాద్రి శిఖరం దిగువనున్న మహాకామేశ్వరీ ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీ అలంకరించారు.మూలవిరాట్టుకు కుంకుమ పూజలు చేశారు. ఎస్ఆర్‌పురంలోని కనకదుర్గ ఆలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కాయితీ ఎర్రిబాబు ఆధ్వర్యంలోఅమ్మవారిని పసుపు కొమ్ములతో అలంక రించారు. వెంకటాద్రి శిఖరంన వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని పంచామృతాభిషేకాలతో అభిషేకించారు.


మంగాదేవి ఆలయంలో కుంకుమార్చన


శాకంబరిదేవిగా మరిడిమాంబ

శాకంబరీ దేవిగా మరిడిమాంబ

వేపగుంట: వరలక్ష్మీనగర్‌లోని మరిడి మాంబ ఆలయంలో ఆలయంలో అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

మహారాణిపేట, ఆగస్టు 23: సాగర్ నగర్ ఇస్కాన్ మం దిరంలో ఈనెల 24వ తేదీనుంచి 27 వ తేదీ వరకు శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్స వా లు నిర్వహించనున్నట్టు ఇస్కాన్ నగర శాఖ అధ్య క్షుడు సాంబదాస ప్రభూజీ తెలిపారు. శుక్ర వారం నగరంలో ఓ హోటల్‌లో నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకృష్ణామి వేడుకలు పురస్కరించుకుని 26వతేదీన మయాపూర్ భక్త బృందంతో హరేకృష్ణ మహామంత్ర సంకీర్తన, ఉదయం 4.30 నిమిషాలకు మంగళ హారతి, 9 గంటలకు దర్శన హారతితోపాటు భక్తులతో ఉంజల సేవ, చిన్నా రులతో వేషధారణలు, యువత ఉట్టి కొట్టే సంబరాలు, నృత్య పోటీలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈ సమావే శంలో మాతాజీ నితాయి సేవిని, ఎం.వి. రాజశేఖర్, బి.హెచ్. వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.








కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో అస్తవ్యస్తంగా కార్లు


మలుపు తిరగలేక నిలిచిన ఆర్టీసీ బస్సు

అస్తవ్యస్త పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యలు

- కేజీహెచ్, కలెక్టరేట్ జంక్షన్లలో నిత్యం యాతనే..
- ఆస్పత్రుల ఎదుట రోడ్డుపై యథేచ్ఛగా వాహనాలు నిలిపివేత
- ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ అంతంతమాత్రం

మహారాణిపేట, ఆగస్టు 23: కేజీహెచ్ నుంచి కలెక్టరేట్ జంక్షన్‌కు వెళ్లే రహదారిలో ఆటోలు, ఇతర వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. జగదాంబ నుంచి కలెక్టరేట్ జంక్షన్, కేజీహెచ్ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారిలో ఈ పరిస్థితి నెలకొంటోంది. దీనితో కేజీహెచ్, ఇతర ఆసుపత్రులకు వచ్చే రోగులు, కలెక్టరేట్, జిల్లా పరిషత్ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. ప్రధానంగా జగదాంబ జంక్షన్ నుంచి వచ్చే మార్గంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చే వాహనాలు రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేస్తుండడంతో ఆర్‌టీసీ బస్సులతో పాటు అంబులెన్స్‌లు ఇతర వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంటోంది. ప్రధానంగా బస్సులు వంటి భారీ వాహనాలు మలుపు తిరిగేందుకు సమస్యగా మారుతోంది. కేజీహెచ్ ఆవుట్ గేట్ వద్ద ఆటోలు పాసింజర్ల కోసం నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది. కేజీహెచ్ ఆసుపత్రి నుంచి అవుట్‌గేట్ ద్వారా బయటకు వచ్చేవారు కలెక్టరేట్ జంక్షన్ నుంచి వచ్చే వారి వాహనదారులు రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు కలెక్టరేట్ జంక్షన్, లేపాక్షి జంక్షన్‌ల వద్ద మాత్రమే విధుల్లో పరిమితమవుతున్నారు. సెల్‌ఫోన్‌లతో హెల్మెట్‌లేని వారు జరిమానాలు, వాహనాలు రికార్డుల పరిశీలనలతో కాలం గడుపుతున్నారు. నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బందులు తలెత్తుతున్న ప్రదేశాల్లో ఒక్క రూ కానరాకపోవడంతో విమర్శలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ట్రాఫిక్‌తో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు ఇకనైనా రద్దీగా ఉన్న ప్రాంతాలలో సిబ్బందిని ఏర్పా టు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

కేజీహెచ్‌నుంచి 26 మంది చిన్నారుల డిశ్చార్జ్


కేజీహెచ్‌నుంచి డిస్చార్జ్ చేసిన చిన్నారులతో వైద్య సిబ్బంది

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కలుషిత ఆహారం తిని అనారోగ్యానికి గురై కేజీహెచ్‌లో చేరిన చిన్నారులు కోలుకున్నారు. పూర్తి ఆరోగ్యంగా ఉండడంతో శుక్రవారం 26 మందిని వైద్యులు డిశ్చార్జ్ చేశారు. వీరంతా ఇప్పటివరకు పీడియాట్రిక్ విభాగంలోని జనరల్ వార్డులో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఆస్పత్రిలో మరో 12 మంది చికిత్స పొందుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రిలో నలుగురు చిన్నారులకు వైద్య సేవలు అందుతున్నాయి. కోలుకున్న చిన్నారులను ప్రత్యేక వాహనాల్లో స్వగ్రామాలకు తరలించారు. ఆస్పత్రి అధికారులు దగ్గరుండి వారిని వాహనాల్లోకి ఎక్కించారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, చీఫ్ డైటీషియన్ రమణమూర్తి, పీడియాట్రిక్ విభాగానికి చెందిన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

డాబాగార్డెన్, ఆగస్టు 23: హరేకృష్ణ మూమెంట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఈ నెల 25, 26వ తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు హరేకృష్ణమూమెంట్ ప్రతినిధి శ్యామా మాధవదాస తెలిపారు. శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు. నగరంలోని భక్తుల సౌకర్యం కోసం 25, 26 తేదీల్లో ఎంవీపీ కాలనీ గాదిరాజుపాలెస్‌లో వేడుకలు జరుగుతాయన్నారు. మధురవాడ, ఆనందపురం, భీమిలి భక్తులకోసం ఐఐఎం రోడ్డులోని గంభీరంలో 25,26,27 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు.

నిజాయితీకి మారుపేరు 'టంగుటూరి': కలెక్టర్


టంగుటూరి ప్రకాశం పంతులు చి త్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు


సీపీ శంఖ బ్రత బాగ్చీ..

మహారాణిపేట, ఆగస్టు 23: మాజీ ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నిజాయితీకి మారుపేరని కలెక్టర్, వక్తలు కొనియాడారు. ప్రకాశం పంతులు 153వ జయంతి కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆయన చి త్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సీఎంఆర్‌డీ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, డీఆర్‌వో కె. మోహనకుమార్ పాల్గొన్నారు. పోలీసు కమిషనరేట్‌లో కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ టంగుటూరి చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టంగుటూరి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో..

కేజీహెచ్‌లో సూప రింటెం డెంట్ శివానంద టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పించారు.ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధికి టంగుటూరి చేసిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూప రింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, ఏవో జగదీష్, మేనేజర్ పీఎం జవహర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.


కేజీహెచ్‌లో నివాళులరిస్తున్న సూపరింటెండెంట్ శివానంద, వైద్య సిబ్బంది

వైద్య సిబ్బందికి సమయపాలన తప్పనిసరి

- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు


రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

సీతమ్మధార, ఆగస్టు 23: వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు ఆదేశించారు. నగరంలోని మద్దిలపాలెం, బాపూజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆయన శు క్రవారం సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, మలేరియా, డెంగ్యూ, అడల్ట్ బీసీజీ వాక్సిన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరోగ్య సిబ్బంది ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు వేయాలని, లీవ్ రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్లనుసక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఏఎన్‌ఎంస్, ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లు గర్భిణులకు ఐరన్ మాత్రలు అందచేయాలన్నారు ఏఎన్‌ఎంఎస్, ఆశా కార్యకర్తలు సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. కీటక జనిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో ఎన్‌హెచ్‌ఎం ఆరోగ్య కేంద్ర వైద్యులు బి.ఉమాపతి, ఎంపీహెచ్‌ఈవో,సిబ్బంది నాగభూషణం పాల్గొన్నారు.

డీఆర్‌ఎం తనిఖీలు

విశాఖపట్నం, ఆగస్టు 23: వాల్తేరు డివిజన్ పరిధిలోని విశాఖ, విజయనగరం సెక్షన్‌లో డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ శుక్రవారం పర్యటించారు. కొత్తవలస, పెందుర్తి స్టేషన్‌లలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులతోపాటు భద్రతా ఆడిట్‌ను తనిఖీ చేశారు. కొత్తవలస స్టేషన్‌లో ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్, పాయింట్లు, క్రాసింగ్, ట్రాక్ సర్క్యూట్ నిర్వహణలో పాటిస్తున్న భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించారు. అలాగే, యార్డు లే అవుట్, ట్రాక్, సిగ్నలింగ్ సిస్టమ్‌లను పరిశీలించారు. స్టేషన్‌లో అమృత స్టేషన్ పథకంలో భాగంగా చేపట్టిన 12 అడుగుల వెడల్పు గల పాదచారుల వంతెన నిర్మాణం, పార్కింగ్ సౌకర్యాలు, భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అక్కడ నుంచి పెందుర్తి స్టేషన్‌కు చేరుకుని ప్రయాణికుల మెరుగుపరచాల్సిన సదుపాయాలపై అధికారులతో చర్చించారు. ఈ పర్యటనలో ఏడీఆర్‌ఎం సుధీర్‌కుమార్ గుప్తా, అధికారులు పాల్గొన్నారు.


పెందుర్తి రైల్వే స్టేషన్ వద్ద పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

కనకమహాలక్ష్మికి శ్రావణ పూజలు

జగదాంబ కూడలి, ఆగస్టు 23: వన్‌టౌన్ కనకమహాలక్ష్మి ఆల యంలో శ్రావ ణ శుక్రవారం పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రావణలక్ష్మీ హోమం, కుంకుమ పూజల్లో 230 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయం శ్రావణశోభతో వెలుగులీనుతుంది. భక్తులు ఉదయం నుంచి దర్శనానికి బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.


అలంకరణలో అమ్మవారు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

కనకమహాలక్ష్మి నిత్యాన్నదానికి నగరానికి చెంది గరిమెళ్ల సూర్యవెంకటలక్ష్మీనారాయణ దివంగత భార్య వెంకట సీతామహాలక్ష్మి పేరిట రూ. లక్ష విరాళంఅందించారు. ఈ చెక్కును జేఈవో వి.రాంబాబుకు అందజేశారు. దాతకు ప్రత్యేకదర్శనంతోపాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శాకంబరిదేవిగా పార్వతీదేవి

సీతంపేట: సీతంపేటలోని పార్వతీశ్వర ఆలయంలో శ్రావణమాసం మూడో శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకంబరి దేవి అవతారంలో అలంకరించారు.భక్తులు కుంకుమ అర్చనలు చేశారు. అర్చకులు భాస్కర్ శర్మ, శివాజీశర్మలు అమ్మవారికి ప్రత్యేక నామాలతో పూజలు జరిపించారు.


కూరగాయల అలంకరణలో పార్వతీదేవి

ఘనంగా అంతరిక్ష దినోత్సవం


వేదికపై అధ్యాపకులతో విద్యార్థులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 23 : గ్రేటర్ 44వ వార్డు తాటిచెట్లపాలెంలోని పీఎం కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో శుక్రవారం అంతరిక్ష దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చంద్రయాన్-3 నేపథ్యంలో విద్యార్థుల లఘునాటిక ప్రదర్శించారు. అనంతరం ఇస్రో విజయాలపై విద్యార్థులు ప్రసంగించారు. శాస్త్రవేత్తలు, విద్యార్థుల మధ్య ఇంటర్వ్యూ పేరిట అభినయించారు. తర్వాత చంద్రయాన్-3పై క్విజ్ పోటీలు నిర్వహించారు. వి ద్యార్థులు వర్ణచిత్ర ప్రదర్శనను ప్రిన్సిపాల్ కమల్‌జిత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు నిధి, రవికుమార్, యర్రయ్య కమల రాణి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంతో జీవరాశి మనుగడ

కంచరపాలెం, ఆగస్టు 23: పర్యావరణ పరిరక్షణతో భావితరాల మనుగడ సాధ్యమని గీతం యూనివర్సిటీ పర్యావరణ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కొల్లి సురేష్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏడో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులతో శుక్రవారం చమురు రసాయనాలు, ఆయిల్ నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలపై టెక్నికల్ టాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఎస్‌టీడీ విశాఖ, ఐఎస్‌టీడీ చాప్టర్ కెమికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పర్యావరణం పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రొ.సురేష్ మాట్లాడుతు పర్యావరణానికి ముప్పు జరిగితే మానవళి మనుగడ ప్రశ్నార్థంగా మారుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డా.ఓఆర్‌ఎం రామ్, డా.ముఖేశ్, డా.బి.దేముడు.బి.వి.లక్ష్మణరావు, ప్రశాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.


ప్రొ.సురేష్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

'కమిటీ కుర్రోళ్లు'కు ప్రేక్షకాదరణ


మాట్లాడుతున్న నిర్మాత నిహారిక, నటీనటులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 23: కమిటీ కుర్రోళ్లు సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు చిత్ర నిర్మాత నీహారిక కొణిదెల అన్నారు. శుక్రవారం రాత్రి డాబాగార్డెన్స్ సూర్యాబాగ్ శ్రీవెంకటేశ్వరథియేటర్‌లో ఈ సినిమా యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ ఈ నెల 9న విడుదలైన ఈ చిత్రం పెద్ద విజయం సాధించిందన్నారు. 1990 దశకంలో కథాంశమన్నారు. నగరానికి చెందిన ప్రసాద్, సందీప్, రుషిక ఇందులో నటించారన్నారు. దర్శకుడు యదువంశీ, చిత్ర నటులు సందీప్ సరోజ్, ప్రసాద్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూములు ఆక్రమణకు గురైతే చర్యలు

మహారాణిపేట, ఆగస్టు 23: జిల్లాలోని దేవదాయ, ఇతర ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికారదని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో భూ పరిరక్షణ జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జిల్లాలో ఇప్పటికే విలువైన భూములు ఆక్రమణ జరిగాయని, ఇకపై అలాంటి పరిస్థితి రాకుండా కాపాడాలని కోరారు. దేవదాయ శాఖ భూముల్లో సరిహద్దులు నిర్ధారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ ఉప కమిషనర్ కె. శిరీష మాట్లాడుతూ జిల్లాలో 11దేవాలయాలకు చెందిన భూములు ఆక్రమణలో ఉన్నాయని, సంబంధిత ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్‌డీవో, దేవాలయాల ఈవోలు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్సు రిజిస్ట్రార్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మికులతో చెలగాటం

... 5వ పేజీ తరువాయి

ఆరు నెలలు శిక్షణ అందిస్తాయి. ఆ తరువాత కూడా ఉత్పత్తి మారిన ప్రతిసారీ శిక్షణ ఇస్తుంటారు. అదే మధ్య, చిన్నతరహా కంపెనీల్లో ఫ్రెషర్స్‌ను తీసుకున్నా శిక్షణ ఉండదు. రియాక్టర్‌లో ముడిసరకులు, తరువాత సాల్వెంట్ కలిపి ప్రాసెస్ చేసేటప్పుడు ఒక ఫార్ములా ఉంటుంది. ఉదాహరణకు రియాక్టర్‌లో 100 కిలోల ముడిసరుకు వేసి ఉత్పత్తి చేయాలనుకుంటే కచ్చింతంగా అంతే పరిమాణం వాడాలి.. అంతకు మించి వేస్తే ఇబ్బందులు వస్తాయి. అటువంటప్పుడు రియాక్టర్‌లో ఒత్తిడి, ఆవిరి ప్రమాణాలు పెరిగిపోతాయి. ఎక్కువ ప్రమాదాలు జరగడానికి ఇలాంఠ ప్రమాణాలు పాటించకపోవడమే కారణమని నిపుణులు చెబుతున్నారు. రియాక్టర్ నుంచి సాల్వెంట్ డ్రమ్ముల్లోకి పంపి అక్కడ ఫిల్టర్ చేస్తుంటారు. తరువాత డ్రయ్యర్ విధానంలో పొడిచేసి ప్యాకింగ్ చేస్తారు. ఈ విధానం మొత్తం పూర్తయ్యేవరకు సీనియర్లు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కానీ కొన్నిచోట్ల సీనియర్ల కొరతతో జూనియర్లతో ప్రాసెసింగ్ చేస్తున్నారని బలరామ్‌నాయుడు అనే కెమికల్ ఇంజనీరు అభిప్రాయపడ్డారు. రియాక్టర్‌లో ముడిసరుకు, సాల్వెంట్ వేసిన తరువాత ప్రాసెసింగ్‌కు టైమ్ ఖరారుచేస్తారని, ఈ మధ్యలో తేడా వస్తే రిస్క్ మేనేజ్‌మెంట్ విధానం అమలుచేసి సమస్య పరిష్కరించే అనుభవజ్ఞుల కొరత ఉందని, ఇందుకు కాస్ట్ కటింగ్స్ (తక్కువ వేతనాలు) విధానం అమలుచేస్తుంటారని ఆరోపించారు.

ఇదిలావుండగా ఫార్మా, కెమికల్ కర్మాగారాల్లో ఉద్యోగులకు పక్కాగా శిక్షణ అవసరమని ఏయూ ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య సిద్ధయ్య అభిప్రాయపడ్డారు. మిగిలిన రంగాలకు భిన్నంగా ఈ కంపెనీల్లో పనిచేయాలంటే ఆయా కెమికల్స్‌పై అవగాహన అవసరమన్నారు. అయితే ఎంఎన్‌సీ కంపెనీలు మాత్రం శిక్షణ ఇచ్చిన తరువాతే విధుల్లోకి తీసుకుంటాయన్నారు.

వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజనే కారణమా?

... 5వ పేజీ తరువాయి

బయటకు వెళ్లే మార్గం లేక ఒత్తిడి పెరిగింది. కేబుల్ డక్ట్ నుంచి గ్రౌండ్‌ఫ్లోర్ మొత్తం వ్యాపించింది. దీనికి కొంత సమయం పడుతుంది. అప్పటివరకు గదిలో పొగ, వాసన విషయాన్ని సెన్సార్లు పసిగట్టి అలారం మోగాలి. అలారం మోగిందా? సెన్సార్లు ఉన్నాయా? ఒకవేళ ఉండీ పనిచేయడంలేదా? మోగినా పనిలో ఉన్నవారు గుర్తించలేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సెన్సార్లు మోగకుంటే మరేదైనా కారణంతో ప్రమాదం జరిగిందా? అన్న అనుమానం వ్యక్తమవుతోంది. రియాక్టర్‌ల నుంచి సాల్వెంట్ డ్రమ్ములోకి పంపేటపుడు పైపులు లీకైనా వెంటనే సెన్సార్లు అప్రమత్తంచేస్తాయి. మూడో అంతస్థులోనూ సెన్సార్లు ఏర్పాటుచేయలేదా? అని ఇంజనీరింగ్ నిపుణులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

ఇదిలావుండగా కర్మాగారంలో పీరియాడికల్‌గా తనిఖీలు చేయకపోవడంతోనే ఎసెన్షియాలో ప్రమాదం జరగడానికి కారణంగా పేర్కొంటున్నారు. ఉత్పత్తులకు తగిన విధంగా కర్మాగారం సిద్ధంగా లేకపోతే అనుమతులు ఇవ్వకూడదని స్పష్టంచేశారు. తాజా ఘటన నేపథ్యంలో కర్మాగారంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని సూచిస్తున్నారు. ఎసెన్షియా కంపెనీ ఘటనతో ఉమ్మడి జిల్లాలో అన్ని కర్మాగారాల్లో సెన్సార్లు, ఇతర పరికరాలు ఉన్నాయా? అన్నది సంబంధిత అధికారులు తనిఖీలుచేసి, అవి సక్రమంగా పనిచేసేలా ఆదేశాలు ఇవ్వాలని సూచిస్తున్నారు.

సంక్షేమశాఖలకు జవసత్వాలు

... 5వ పేజీ తరువాయి

రాయితీ, బ్యాంకు నుంచి రూ.2.5 లక్షలు రుణం ఇస్తారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి అమలుచేయాలని భావిస్తున్న యూనిట్లు విలువ కూడా దాదాపుగా ఇంతే ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తాలతో ఉపాధి ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. డైరీ ఫామ్, కోళ్లఫామ్, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తుల తయారీ, తేనె పట్టు పెంపకం ఏర్పాటు చేసుకోవవచ్చని అధికారులు చెబుతున్నారు. వీటితోపాటు కుల సంఘాలకు కూడా సబ్సిడీతో రుణాలను అందించనున్నారు. కార్లు, ట్రాక్టర్లు, ట్రాక్టర్ పరికరాలు, ఆటోలు, వ్యాన్లు వంటివి అందించనున్నారు.

లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు

కూటమి ప్రభుత్వం అమలుచేయాలని భావిస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులను ఎలా ఎంపిక చేయాలన్న దానిపై కసరత్తు జరుగుతోంది. ఒక్కో జిల్లాకు ఎన్ని యూనిట్లు కేటాయిస్తారన్న దానిని బట్టి లబ్ధిదారుల ఎంపిక ఉండాలన్నది ప్రభుత్వ ఆలోచన. దరఖాస్తులు స్వీకరిస్తే భారీగా వచ్చే అవకాశం ఉందని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దరఖాస్తులు తీసుకోకుండా మంజూరు చేయడం అనేక ఇబ్బందులకు కారణమవుతుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులను నేరుగా ఆయాశాఖలు ఆధ్వర్యంలో ఎంపిక చేయాలా..? స్థానిక ప్రజాప్రతినిధులకు అప్పగించాలా..? అన్నది తెలియాల్సి ఉంది. గతంలో సంక్షేమశాఖలకే నేరుగా దరఖాస్తులు అందజేసేవారు. ఇక్కడి నుంచే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరిగేది. ఈ శాఖల ఆధ్వర్యంలోనే రుణాలు, వాహనాలను అందించేవారు. రుణాల రికవరీ బాధ్యతను కూడా ఆయా శాఖల అధికారులే పర్యవేక్షించేవారు. ఈ పథకాల్లో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాకు కనీసం ఐదు వేల వరకు యూనిట్లు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

6,704.13 ఎకరాలు ఔట్

... 5వ పేజీ తరువాయి

పేదలకు పట్టాలు ఇచ్చిన భూములు, గాజువాకలో హౌస్‌కమిటీ 22-ఎ నుంచి తప్పించారని చెబుతున్నారు. మొత్తంగా 22-ఎ నుంచి తప్పించిన 6,701.13 ఎకరాల్లో రెగ్యులర్ ప్రాసెస్‌లో 5,724.31 ఎకరాలున్నాయి. వీటిలో మూడు మండలాల్లో పోర్టు, ఎయిర్‌పోర్టు, పేదలకు ఇచ్చిన పట్టాలు, హౌస్ కమిటీకి చెందిన భూములు 5,338.29 ఎకరాలున్నాయి. ఇంకా భీమిలిలో 67.63 ఎకరాలు, ఆనందపురంలో 46.32 ఎకరాలు, మహారాణిపేటలో 1.27 ఎకరాలు, పద్మనాభంలో 10.88 ఎకరాలు, పెదగంట్యాడలో 8.1 ఎకరాలు, పెందుర్తిలో 20.58 ఎకరాలు, సీతమ్మధారలో 36.38 ఎకరాలు, విశాఖ రూరల్‌లో 194.86 ఎకరాలను 22-ఎ నుంచి రెగ్యులర్ విధానంలో తొలగించారు. ఇంకా పేదల ఇళ్ల కోసం సేకరించిన భూములకు పరిహారంగా రైతులకు 369.9 ఎకరాల్లో ప్లాట్లు కేటాయించడంతో వాటిని 22-ఎ నుంచి తొలగించారు. 609.93 ఎకరాల డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేయడంతో వాటిని నిషేధిత జాబితా నుంచి తప్పించారు. వీటిలో ఎక్కువగా ఆనందపురంలో 407.77 ఎకరాలు, భీమిలిలో 52.513 ఎకరాలు, పద్మనాభంలో 129,6 ఎకరాలు, పెందుర్తిలో 20.04 ఎకరాలున్నాయి. నిషేధిత జాబితా నుంచి నాలుగు గ్రామీణ మండలాల్లో తొలగించిన భూములు 1119.04 ఎకరాలున్నాయి.విశాఖ రూరల్ మండలంలో 194.86 ఎకరాలు తొలగించారు. ఫ్రీహోల్డ్ భూములు, ల్యాండ్ పూలింగ్ భూములు మినహాయించి చూస్తే స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులు, పొలిటికల్ సఫరర్లకు చెందిన భూములు, వివాదాస్పదంగా గతంలో గుర్తించిన భూములను 22-ఎ నుంచి తొలగించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ భూముల్లో 516.9 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. వాటిలో ఆనందపురంలో 203.29 ఎకరాలు , విశాఖ రూరల్ మండలంలో 108.02 ఎకరాలున్నాయి. రిజిస్ట్రేషన్ అయిన భూముల్లో ఎక్కువగా గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తులు, వారి బంధువులు, స్నేహితులు కొనుగోలుచేశారనే ఆరోపణలున్నాయి.

CLASSIFIEDS

CHANGE OF NAME

I, SINGAMPALLI THRINATH (New Name), S/o. Singampalli Govind, previously called SINGAMPALLI THIRINATH (Old Name) resident of Block No.5, G-8, JNNURM Colony, Gnanapuram, Visakhapatnam-530004. Now changed my name from SINGAMPALLI THIRINATH (Old Name) to SINGAMPALLI THRINATH (New Name) for all purpose.

CHANGE OF NAME

I, MAKKUVA ANITHA RANI (New Name), W/o. Makkuva Ravi Shankar, previously called NANDI ANITHA (Old Name) resident of 39-4-5/3/13, 4th Floor, Flat No.14, Sai Lalitha Residency, Muralinagar, Visakhapatnam-530007, Andhra Pradesh. Now changed my name from NANDI ANITHA (Old Name) to MAKKUVA ANITHA RANI (New Name). Henceforth I will be called as MAKKUVA ANITHA RANI (New Name) for all purpose.

PLOT FOR SALE

VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీ గంధం, ఎర్రచందనం మొక్కలతో చ.గ. 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్, ఫామ్ హౌస్ ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర : 9121884889
AJB-53

COMMERCIAL SPACE FOR SALE

★ 4000 sft. (Comm.) in G.F. & 1250 sft. (3 BHK) in Fourth Floor at Gopalapatnam Main Road for Sale. Cont.: 9849116584
AJV_192582

PLOT FOR SALE

★ CRDA approved Chodavaram, Vijayawada gated layout Plots, 15 minutes from Benz Circle beautiful location between Krishna River & KEB Canal. M-9948099840, 9866602266 AJH-98269

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 18k. Ph: 9160900024, 9640400073 AJH-16356

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093



సింహాద్రినాథుడికి వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం,ఆగస్టు 23 :వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరలుతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు.మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

'జగన్ విమర్శలు అర్థరహితం'

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 23 : వైసీపీ అధినేత జగన్ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు అర్థరహితమని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్ ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ ఇప్పుడు పరిశ్రమల భద్రత కోసం మాట్లాడడం విచిత్రంగా ఉందన్నారు. ఐదేళ్ల పాలనలో పరిశ్రమల భద్రత పట్టించుకోకుండా, జె ట్యాక్స్ వసూలు చేసి ఇబ్బంది పెట్టారన్నారు. వైసీపీ నిర్లక్ష్యమే పరిశ్రమలకు శాపాలుగా మారాయన్నారు.

16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా మురళీకృష్ణ



కొమ్మాది, ఆగస్టు 23 : బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా కేవీ మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన బెటాలియన్‌లోని హెడ్ క్వార్టర్, వెల్ఫేర్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలను సందర్శించారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ సీహెచ్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి. దేవానందరావు, పి. సత్యం, వి. నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం

భీమునిపట్నం, ఆగస్టు 23 : ఓటుకు నోటు కేసులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సుప్రీం కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడం పట్ల టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన బీచ్ రోడ్‌లోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నీతి, నిజాయతీకి కేరాఫ్ అడ్రస్‌గా చంద్రబాబు నిలుస్తారని చెప్పారు. దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో ఆయన నిజాయతీ మరోసారి రుజువైందన్నారు. చంద్రబాబు నిజాయతీ రాజకీయాల వల్లే ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పుతోనైనా వైసీపీ నేతలు బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు.

తల్లి చెంతకు తప్పిపోయిన బాలుడు

భీమునిపట్నం, ఆగస్టు 23 : బీచ్‌రోడ్‌లో గురువారం రాత్రి పది గంటల తర్వాత దివ్యాంగ బాలుడు బీచ్ రోడ్ నైట్ పెట్రోలింగ్ పోలీసులకు పట్టుబడ్డాడు. వివరాలు సరిగ్గా చెప్పలేకపోవడంతో డఫ్ అండ్ డమ్‌గా గుర్తించారు. మాటలు రాకపోవడంతో బాలుడికి విశాఖ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో రక్షణ కల్పించారు. శుక్రవారం వివిధ వాట్సాప్ గ్రూపులు, మీడియాలో ప్రసారం చేయడంతో బాలుడి కుటుంబీకులు పోలీసులను సంప్రతించారు. బాలుడు తల్లిదండ్రులు ఆరిలోవ చివరి బస్‌స్టాప్ వద్ద ఉంటున్నారని, వారికి బాలుడ్ని అప్పగించామని పోలీసులు చెప్పారు.

సినిమా గైడ్

- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** సంగం, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), విశేష్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **తంగలాన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), తాతా (తగరపువలస)
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, శ్రీకన్య (గాజువాక)
- **ఆర్.కె.పురంలో :** శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 44, టమాటా 25, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 22, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 26, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 34, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 120, బరబటి 24, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 30, దోసకాయ 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 40, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



రేవిడి గ్రామంలో అమ్మకానికి సిద్ధం చేసిన ఇసుక పోగులు



నదిలో చేపట్టిన ఇసుక తవ్వకాలు

గోస్తనీ నదిలో దొంగలు పడ్డారు

- రేవిడిలో దర్జాగా ఇసుక అక్రమ రవాణా
- ఇష్టారాజ్యంగా గోతులు పెట్టి తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

పద్మనాభం, ఆగస్టు 23 : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చినా ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. పర్యావరణం ఏమైపోతే మాకేంటి అన్న చందంగా రేవిడి పంచాయతీ పరిధిలోని గోస్తనీ నదీ పరివాహక ప్రాంతంలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల కళ్లుగప్పి భీమిలి మండలం మజ్జివలస సమీపంలోని లేఅవుట్ నుంచి ఉన్న దారి వినియోగించుకొని నదిలోకి బాట ఏర్పాటు చేసి తవ్వకాలు చేపడుతున్నారు. అధికారికంగా మండలంలోని గోస్తనీ నదిలో ఎలాంటి రీచ్‌లు లేకపోయినా దర్జాగా తమ పని కానిచ్చేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతంలో సుమారు 30 నుంచి 40 అడుగుల లోతులో తవ్వకాలు చేపట్టి సమీపంలో పోగులు వేస్తున్నారు. రాత్రి వేళ ఎవరూ చూడని సమయంలో పోగేసిన ఇసుకను లారీలకు ఎత్తి రవాణా చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో ఇతర ప్రాంతాల్లోని రీచ్‌లు నీటి ప్రవాహంలో నిండి ఉండడంతో డిమాండ్ మేరకు ఒక్కో తారాస్ లారీ ఇసుకను రూ. 60 వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. అక్రమ తవ్వకాలను నిరోధించాల్సిన గనులు, పోలీసు, రెవెన్యూ, నీటిపారుదల శాఖలు చోద్యం చూస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. రైతులు పొలాల్లో మట్టి తోలుకుంటే ఇబ్బంది పెట్టే స్థానిక వీఆర్వోకు ఇసుక తోలం పెద్దఎత్తున జరుగుతున్నా.. ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు నిలదీస్తున్నారు. ఇసుక తవ్వకాల వెనుక స్థానిక వైసీపీ నాయకులు ఉన్నారన్న గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. తవ్వకాల వల్ల సమీపంలోని భూమి కోతకు గురవ్వడంతో పాటు పోలిపల్లి ఆనకట్టకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.ఈ విషయమై ఆర్‌ఐ కోటిని వివరణ కోరగా విచారణ జరిపిస్తామన్నారు.



కృష్ణాపురం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయకుమార్



దాకమర్రి సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జానకి

పంచాయతీలకు పూర్వ వైభవమే లక్ష్యం

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, ఆగస్టు 23 : రాష్ట్రంలో 13,326 పంచాయతీల్లో ఏకకాలంలో గ్రామసభల నిర్వహణ చారిత్రాత్మక ఘట్టమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఉపాధి పథకం కింద 87 రకాల పనులు చేపట్టడానికి ఎన్డీయే ప్రభుత్వం రూ. 4, 500 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. శుక్రవారం ఆయన గంభీరంలో జరిగిన గ్రామ సభలో మాట్లాడారు. వేల కోట్ల నిధులు మళ్లించి గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ప్రజా కంటక పాలన చేసిన వైసీపీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. అభివృద్ధి పనులను పంచాయతీల ద్వారానే చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారని పేర్కొన్నారు. ఉపాధి పనులను కొన్నిచోట్ల తూతూమంత్రంగా చేస్తున్నారని, అలాంటి నిర్లక్ష్యపు ధోరణి సహించేది లేదని హెచ్చరించారు. ఐఐఎం భూసేకరణ నష్టపరిహారం గంభీరం ప్రజల అభీష్టం మేరకు నిర్వహించామని చెప్పారు. ఆర్గానిక్ పంటలు పండిస్తున్న సమీపంలోని గ్రామానికి 8 రోజులుగా వ్యవసాయ విద్యుత్ సరఫరా చేయడం లేదని అక్కడి రైతులు తన దృష్టికి తీసుకువచ్చారని అధికారుల తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ గంభీరం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. పంచాయతీ వ్యవస్థను పటిష్టపరచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సర్పంచ్ ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కోరాడ రాజబాబు, చిక్కాల విజయ బాబు, శారద, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని 22 పంచాయతీల్లోనూ గ్రామసభలు నిర్వహించారు. సభల్లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలతో పాటు రాబోయే ఐదేళ్లలో చేపట్టనున్న ఉపాధి పనులకు ప్రణాళికలు కూడా రూపొందించారు. ఎంపీడీఓ విజయకుమార్, ఈఓఆర్డీ కుమార్, ఏపీఓ వరలక్ష్మి నిర్వాహకులుగా వ్యవహరించగా, వ్యవసాయాధికారి చలం,డీటీ నియోగ్, ఏఈలు శ్రీనివాసరావు, పద్మజ, చిరంజీవి, ఎంఈఓలు రమణ, బాబూలాల్, పశువైద్యాధికారులు మహేష్, అరుల్, శ్రీనివాస్, ఏపీఎం ప్రభాకర్ నోడల్ అధికారులుగా వ్యవహరించారు. సభలకు ఆయా పంచాయతీల సర్పంచులు అధ్యక్షత వహించగా కార్యదర్శులు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ రాంబాబు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమణ, గంగరాజు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నగేష్‌కుమార్, తెలుగు యువత మండల అధ్యక్షుడు సత్యనారాయణ, బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడు మహేష్, జనసేన మండల అధ్యక్షుడు కె. రామస్వామినాయుడు, సారధి, నాయుడు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు అవసరం

భీమునిపట్నం రూరల్ : మండలంలోని 16 పంచాయతీల్లోనూ గ్రామసభలు నిర్వహించామని ఎంపీడీఓ జానకి తెలిపారు. దాకమర్రి, తాటితూరు సభలకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణ గ్రామ పంచాయతీల ఆవశ్యకతను ఉపాధి పథకం ముఖ్య ఉద్దేశాన్ని తెలియజేశారు.

అనంతుని దేవస్థానంలో లక్ష తులసి పూజ రేపు

పద్మనాభం, ఆగస్టు 23 : పద్మనాభంలోని అనంత పద్మనాభుడి దేవస్థానంలో ఆదివారం లక్ష తులసి పూజ నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ నానాజీ బాబు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏటా ఈ ఉత్సవాన్ని శ్రావణ మాసంలో ఉత్సవ కమిటీ సహకారంతో దేవస్థానం నిర్వహిస్తోందన్నారు. ఈమేరకు కుంతీమాధవస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించే ఈ ఉత్సవంలో భాగంగా వేద పండితుల ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ అనంత పద్మనాభునికి, కుంతీమాధవస్వామికి పంచామృతాభిషేకం నిర్వహిస్తారన్నారు. అనంతరం లక్ష తులసి పూజ చేపడతారన్నారు.

27న ఆశీలు వసూలుకు బహిరంగ వేలం

భీమునిపట్నం, ఆగస్టు 23 : జీవీఎంసీ జోన్ వన్‌లో వున్న భీమిలి రోడ్ మార్జిన్, లాల్ బహదూర్‌శాస్త్రి మార్కెట్, కలిగొట్ల సూర్యనారాయణనాయుడు మార్కెట్‌లో ఆశీలు వసూలుకు ఈనెల 27న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జడ్సీ కనకమహాలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశీలు వసూలుకు అనుమతి ఇచ్చిన తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ కాలపరి మితి ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు జోనల్ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు జరిగే వేలంలో పాల్గొనాలని చెప్పారు.

పసుపు కొమ్ములతో పార్వతీదేవికి అలంకరణ



సాగర్‌నగర్, ఆగస్టు 23 : రుషికొండలో గంగా బాలాత్రిపురసుందరీ సమేత కైలాస సప్త రుషీశ్వర ఆలయంలో పార్వతీదేవిని శుక్రవారం పసుపు కొమ్ములతో అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గాజుల శోభారాణి, అర్చకులు శ్రావణ్ కుమార్, సంపత్‌కుమార్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో వెలగని వీధి దీపాలు

సాగర్‌నగర్, ఆగస్టు 23 : సాగర్‌నగర్‌లో ఎల్‌ఐజీ-సి, ఎంఐజీ-డి గృహ సముదాయాల మధ్య ఉన్న రోడ్డులో ఆరు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జీవీఎంసీ సిబ్బందికి ఫిర్యాదు చేస్తే తూతూమంత్రంగా వచ్చి మరమ్మతులు జరిపి వెళ్లిపోతుండడంతో మళ్లీ యథాస్థితి నెలకొంటోంది. లైట్లు వెలగకపోవడంతో ఆకతాయిలు, చిల్లర దొంగలు పెట్రేగిపోతున్నారు. ఆరుబయట పార్కు చేసి ఉన్న బైక్‌ల నుంచి పెట్రోల్ తీసేయడం, ఇంటి బయట ఉంచిన విద్యుత్ వస్తువులు మాయం చేయడం వంటి పనులకు పాల్పడుతున్నారు.

వైభవంగా తిరువీధి

సింహాచలం, ఆగస్టు 23 : శ్రావణ శుక్రవారం ఉత్సవంలో భాగంగా అప్పన్న ఆలయంలో సాయంత్రం శ్రావణ లక్ష్ముల తిరువీధి వైభవంగా నిర్వహించారు. పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తులు సింహవల్లీ తాయార్, చతుర్భుజి అమ్మవార్లను ప్రత్యేక పల్లకిపై ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ ఆలయ బేడా మండపంలో తిరువీధి జరిపారు.


ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న గొండు సీతారామ్

ఆరిలోవ, ఆగస్టు 23 : రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ అన్నారు. శుక్రవారం ఆయన ఆరిలోవ సెయింట్ ఆన్స్ పాఠశాలలో బాలల హక్కులపై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. జిల్లా విద్యా శాఖ సహకారంతో అన్ని ప్రైవేటు పాఠశాలల్లోనూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్వశిక్షా భియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, ఎంఈఓ అనురాధ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు లక్ష్మీ, అర్బన్ చైల్డ్ డెవలెప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి శ్రీలత, కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ అధికారి విజయ, తదితరులు పాల్గొన్నారు.

జీవో 84ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

సిరిపురం, ఆగస్టు 23 : జీవో 84ను రద్దు చేసి, మున్సిపల్ ఉపాధ్యాయులను మున్సిపల్ మేనేజ్‌మెంట్‌లో సర్దుబాటు చేయాలని పీఆర్‌టీయూ నాయకులు కోరారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం వారు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీను, కార్యదర్శి నాగేశ్వరరావు, దామోదర్, కనకరాజు, హరికృష్ణ, కరుణాకర్, శ్రీను పాల్గొన్నారు.

ఆంధ్ర కేసరి టంగుటూరికి ఘన నివాళి

విశాఖపట్నం, ఆగస్టు 23 : ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో శుక్రవారం ఘనంగా జరిగింది. వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్, తదితరులు టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మద్రాస్ ప్రెసిడెన్సీ విడిపోయి కర్నూలు రాజధానిగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రానికి టంగుటూరి తొలి ముఖ్యమంత్రిగా పనిచేశారని చెప్పారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటాలు నిరుపమానం అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రవీంద్ర, ముఖ్య ప్రణాళికా అధికారి సంజయ్ రత్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సిరిపురం : ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, అదనపు కమిషనర్లు శ్రీనివాసరావు, వర్మ, తదితరులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు దేశానికి, రాష్ట్రానికి ఎంతో సేవ చేశారన్నారు. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పని చేశారని, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణయక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, మల్లికాంబ, కార్యదర్శి నల్లనయ్య, శ్రీనివాసరావు, పీడీ డి. ఫణిరామ్, కృష్ణారావు, పద్మజ, స్వాతిదాస్, తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, తదితరులు

బ్రాహ్మణ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో..

టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి అధికారికంగా నిర్వహించాలని బ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. జీవీఎంసీ గాంధీ పార్కులోని ప్రకాశం పంతులు విగ్రహానికి సొసైటీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేసిన ప్రకాశం పంతులు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ గౌరవ అధ్యక్షుడు టీఎస్ఆర్ ప్రసాద్, అధ్యక్షుడు చరణ్‌కుమార్, నాయకులు నరసింహమూర్తి, హనుమంతురావు, శర్మ పాల్గొన్నారు.

తోటగరవు హైస్కూల్‌ను అప్‌గ్రేడ్ చేయాలని వినతి



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 23 : తోటగరవు హైస్కూల్‌ను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. శుక్రవారం ఆయన అమరావతిలో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెలగపూడి మాట్లాడుతూ ఆరిలోవ పరిసరాల్లోని ఆరు వార్డుల పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలలకు వందలాది మంది వెళుతున్నారని, పదో తరగతి పాసైన విద్యార్థులను జూనియర్ కళాశాలకు నగరంలోకి పంపించాల్సి వస్తోందని చెప్పారు. దీంతో కొందరు తల్లిదండ్రులు ఆర్థిక భారం, రహదారుల రద్దీ వంటి కారణాలతో పిల్లలను ఉన్నత చదువులకు పంపించడం లేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాల అప్‌గ్రేడ్ ప్రతిపాదన ఉందని చెప్పారు. దీనిపై మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

శ్రీమహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన



కుంకుమార్చన చేస్తున్న వైదికులు

సింహాచలం, ఆగస్టు 23 : శ్రావణ మాసం మూడవ శుక్రవారం పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శ్రీమహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సుప్రభాత ఆరాధనలు తరువాత సువర్ణ అమ్మవారు, చతుర్భుజి తాయార్ అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ బేడా మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో పురోహితులు కరి సీతారామాచార్యులు సారధ్యంలో వైదికులు భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. శాస్త్ర విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం లక్ష్మీ సహస్రనామవళి పఠిస్తూ పది మంది వైదికులు కుంకుమార్చన చేశారు.

వెంకన్న సన్నిధిలో శ్రావణలక్ష్మీ ఆరాధన

వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం కొండదిగువ పూతోటలో కొలువుదీరిన పద్మావతీ, అలిమేల్‌మంగా సమేత వెంకటేశ్వరస్వామి దేవళంలో శ్రావణలక్ష్మీ ఆరాధన శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తిని ప్రత్యేక వేదికపై ఉంచి అర్చకులు రఘు, భార్గవ్ భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. అనంత రం లక్ష్మీ సహస్రనామావళి పఠనంతో కుంకుమార్చన జరిపారు.

'డైట్'లో ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



వేడుకలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

భీమునిపట్నం, ఆగస్టు 23 : అంతరిక్షంలో భారత్ విజయాలను స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన రంగాల్లో కూడా యువత రాణించాలని సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం డైట్ కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్ 3 విజయం ప్రపంచాన్ని భారత్ వైపు చూసేలా చేసిందన్నారు. త్వరలో చంద్రయాన్ 4 ప్రయోగాన్ని జపాన్‌తో కలిసి నిర్వహించడానికి దాదాపుగా ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు.దేశాన్ని అన్ని రంగాల్లోనూ ప్రపంచంలోనే నంబరు వన్‌గా నిలబెట్టడానికి యువత పట్టుదలతో ముందడుగు వేయాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గొట్టేటి రవి, అకడమిక్ మోనిటరింగ్ అధికారి జి. లక్ష్మి, ఎల్. సుధాకర్, జీజీఎస్ నాగేశ్వరరావు, ఎం. మహాలక్ష్మి, ఎస్. త్రినాధరావు, ఆర్. నీలిమ, జె.మాధవి పాల్గొన్నారు.

భీమునిపట్నం (రూరల్) : చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు భారతీయులు అంతరిక్షంలో చేసిన ప్రయోగాలు, తయారు చేసిన ఉపగ్రహాలు గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రత్నం, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, విజయకుమారి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు




నగదు బహుమతి అందుకున్న విద్యార్థులతో ఆర్‌జేడీ విజయ్ భాస్కర్

కొమ్మాది, ఆగస్టు 23 : విద్యార్థులు కష్టపడి చదివి మంచి ప్రయోజకులు కావాలని పాఠశాల విద్యా శాఖ ఆర్‌జేడీ విజయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన విద్యార్థులకు సీఎంఆర్ సంస్థ అందజేసిన నగదు బహుమతులను శుక్రవా రం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాగా చదివే విద్యార్థులకు ఎల్లప్పుడూ దాతల ప్రోత్సాహం ఉంటుందన్నారు. కాగా దివ్యాంగుల కోటాలో ఎచ్చెర్లలో సీటు సాధించిన కె. మైథిలి, వై. హారికకు రూ. 25 వేలు, నూజివీడులో సీటు పొందిన తరుణ్, ఎచ్చెర్లలో సీటు సాధించిన డి. యశ్వంత్, ఎల్. అచ్చుతరావుకు రూ. 15 వేలు చొప్పున నగదు బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సోమయాజులు, ఎస్ఐఎఫ్ఎస్ విద్యా సంస్థల చైర్మన్ సునీల్ మహంతి, పిడి రాము, స్కూల్ కమిటీ చైర్మన్ అచ్చుతరావు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన తప్పనిసరి

భీమునిపట్నం, ఆగస్టు 23 : హెచ్ఐవీపై ప్రతిఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని స్థానిక సీహెచ్‌సీ ఐసీటీసీ కౌన్సిలర్ రావి వెంకటపతిరాజు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీహెచ్‌సీ ఐసీటీసీ ఆధ్వర్యంలో మీకు తెలుసా...? కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు తెలుసా కార్యక్రమం ద్వారా యువతకు హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖ వ్యాధులు, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌వీ సూర్యప్రసాద్, హనుమంతరావు, సీహెచ్‌సీ యువ క్లినిక్ కౌన్సిలర్ సత్య, సీవో మీనాక్షి పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న 'కమిటీ కుర్రాళ్లు'



ఆలయంలో కమిటీ కుర్రాళ్లు సినిమా బృందం

సింహాచలం, ఆగస్టు 23 : కమిటీ కుర్రాళ్లు సినిమా బృందం శుక్రవారం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు.హీరో సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాలతో పాటు 35 మంది యూనిట్ సభ్యులు కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని అంతరాలయంలో పూజలు చేశారు. తమ సినిమాను ప్రేక్షకులు ఆదరించి విజయం అందించడం పట్ల దర్శకుడు యదు వంశీ ఆనందం వ్యక్తం చేశారు.